
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 09.09.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 14 పేజీలు : 12, వెల : ₹ 5




లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# మండిన తెలుగు గుండెలు

- తెలుగు 'దేశం'కు మాత్రమే ప్యాకేజీ
- రాష్ట్ర భవితకు, యువతకు డ్యామేజీ
- అరుణ్‌జైట్లీ ప్రకటనపై సర్వత్రా నిరసన
- చంద్రబాబు సమర్ధింపుపై ఆగ్రహం
- ప్రత్యేకహోదాకు శాశ్వత సమాధి
- 10న రాష్ట్ర బంద్‌కు విపక్షాల పిలుపు

***తెలుగు గుండెలు మరోసారి మండాయి. తెలుగు మనసులు మరోసారి బరువెక్కాయి. తెలుగు ఆత్మగౌరవం మరోసారి మంట గలిసింది. తెలుగునేల మరోసారి తల్లడిల్లింది. ఏంటిది... ఎందుకు ఇది... అసలేం జరుగుతోంది? ఆంధ్రులంటే అడుక్కునేవాళ్ళా? ఢిల్లీలో ఉండే వాళ్లు ధర్మప్రభువులా? ఢిల్లీ వాళ్లేమన్నా ఆంధ్రులకు భిక్షమేస్తున్నారా? ఎవడబ్బసొత్తని జాలి మాటలు మాట్లాడుతున్నారు. ఈ దేశం, ఈ భూమి తమ సొంత జాగీరు అనుకుంటున్నారా?***

అసలు భిక్షం వేయడానికి వాళ్లెవరు? ఎవరి సొమ్ము ఎవరు దానం చేస్తున్నారు... కళ్లబొల్లి మాటలు చెప్పి కేంద్రంలో గద్దెనెక్కిన బీజేపీ నాయకులకంటే బుద్ధి లేకుండా పోయింది. మరి మన ఆత్మగౌరవం ఎక్కడ తగల బడింది. గౌరవం, పౌరుషం అన్నీ చచ్చిపోయాయా? ఆంధ్రుల ఆత్మగౌరవం నినాదంతో పుట్టిన తెలుగు దేశం పార్టీ ఏమైంది. మీరు అడుక్కుతిన్నంత కాలం మేం భిక్షమేస్తూనే వుంటామని ఢిల్లీలో కూర్చుని వాళ్లు చెబితే విజయవాడలో కూర్చుని మనం అడుక్కుతినడానికి అన్ని విధాలా సాయం చేస్తామన్నారని చెప్పి ఆనందించడమేనా ఈ తెలుగుదేశం అధినేత పని!

ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ నెల 7వ తేదీ రాత్రి ఎంతో ఉత్కంఠతతో న్యూస్‌ఛానెల్స్‌ను కన్నార్పకుండా చూశారు. వరల్డ్‌కప్ క్రికెట్‌లో భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌ను ఎంత ఆసక్తిగా చూస్తారో, ఇటీవల రియో ఒలింపిక్స్‌లో పి.వి.సింధు ఆడిన బ్యాడ్మింటన్ ఫైనల్ మ్యాచ్‌ను ఎంత ఆత్రుతగా తిలకించారో, 7వ తేదీ రాత్రి కూడా అంతే ఉత్కంఠతగా టీవీలు చూశారు. ఆంధ్రప్రదేశ్‌ను కేంద్రప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీతో ఉద్ధరించబోతుందని పచ్చమీడియాలో ఒకటే కథనాలు... మరోపక్క ప్యాకేజీతో ఒరిగేదేమీలేదు, ప్రత్యేకహోదాతోనే రాష్ట్రం అభివృద్ధి చెందు తుందంటూ మేధావుల విశ్లేషణలు... ఆరోజంతా హైడ్రామానే.

విజయవాడలో చంద్రబాబు, మంత్రులు, ఢిల్లీలో కేంద్ర మంత్రులు అరుణ్‌జైట్లీ, వెంకయ్యానాయుడు, సుజనాచౌదరి.. లావోస్‌లో ప్రధాని నరేంద్రమోడీ... ఈ మూడు కేంద్రాల మధ్య ప్రత్యేకప్యాకేజీపై సంప్రదింపులు... ప్యాకేజీ డ్రాఫ్ట్‌లో చంద్రబాబు స్పెల్లింగ్ మిస్టేక్స్‌ను కనుగొన్నాడని... అదేదో వాస్కోడిగామా కొలంబస్‌ను కనుగొన్న రీతిలో ఫ్లాష్ న్యూస్... మొత్తానికి వీళ్లందరూ కలిసి ఆంధ్రావాళ్లకు ఘుమఘుమలాడే బిర్యానీని తయారు చేస్తున్నారంత ప్రచారం దట్టించారు. తీరా చూస్తే... అరుణ్‌జైట్లీ ప్రెస్‌మీట్‌లో కూర్చుని కుక్క బిస్కెట్లు విసిరేసినట్లుగా నాలుగు మాటలు (మిగతా 11వ పేజీలో)

## కలలకు ప్రతిరూపం... ఈ స్వర్ణభారతం



3లో

ఈ నెల 4వ తేదీన వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగిన ట్రస్ట్ 15వ వార్షికోత్సవ వేడుకల్లో ఒలింపిక్స్ రజత పతక విజేత పి.వి.సింధును సత్కరిస్తున్న కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్

## గ్రూపులుగా కాపులు

### ఊపందుకున్న ఓట్ల రాజకీయాలు

విభజన తర్వాత రాష్ట్ర రాజకీయాలలో కాపులు కీలకమయ్యారు. ఏపిలో కులపరంగా వాళ్లే మెజార్టీ ఓటర్లయ్యారు. దాంతో ప్రధాన రాజకీయపార్టీల ప్రదక్షిణలన్నీ వారి చుట్టూనే ఉంటున్నాయి. 2014 ఎన్నికల్లో కాపుల మద్దతుతోటే తెలుగుదేశం అధికారంలోకి రాగలిగింది. కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తానన్న హామీతో చంద్రబాబు గద్దెనెక్కాడు. అధికారం చేతికొచ్చాక ఐదేళ్లవరకు ఇక ఆయనను పీకేదేమీ లేదు. ఈ హామీని కాపులు కూడా పెద్దగా పట్టించుకోరులే అని నిర్లిప్తంగా వున్న చంద్రబాబుకు ముద్రగడ పద్మనాభం రూపంలో సమస్య ఎదురైంది. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలంటూ ఆయన లేవనెత్తిన ఉద్యమంతో ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలన్నీ కూడా 'కాపు'ల చుట్టే తిరుగుతున్నాయి.

కాపులు కేంద్రంగా రాష్ట్రంలో ఆసక్తికర రాజకీయాలు చోటు చేసుకుంటున్నాయి. కాపుల కోసం రాష్ట్రంలో మూడు రాజకీయ కేంద్రాలు ఏర్పడ్డాయి. 2014 ఎన్నికల్లో తమ వెంట నడిచిన కాపులను అలాగే నిలబెట్టుకోవడానికి తెలుగుదేశం (మిగతా 11వ పేజీలో)




## నింగిని ముద్దాడింది

### జిఎస్ఎల్‌వి-ఎఫ్05 సూపర్ సక్సెస్



ఇస్రో చరిత్రలో మరో విజయం

3లో

## ఇరిగేషన్ పనుల్లో
# అవినీతికి గేట్లు ఎత్తారు!

తెలుగుదేశం ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత గత రెండున్నర సంవత్సరాల కాలంలో నీరు-చెట్టుల, ఎన్‌డిఆర్, వోఅండ్ఎం పథకాల కింద నెల్లూరుజిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.500 కోట్ల విలువైన పనులు జలవనరుల శాఖ పర్యవేక్షణలో జరిగాయి. ఈ పనుల్లో రాజకీయ జోక్యం పెరిగిందని, పనులు చేయకుండానే చేసినట్లు బిల్లులు చెల్లించి నట్లు సమాచారం. నెల్లూరుజిల్లా కోవూరు నియోజకవర్గంలో రూ.35 కోట్లతో చేప ట్టిన పనుల్లో ప్రజాప్రతినిధులు, ఇంజనీర్లు కలిసి భారీగా నిధులు స్వాహా చేశారని ఆరోపణలు వున్నాయి. దీనిపై కొందరు రైతులు లోకాయుక్తను ఆశ్రయించడంతో విడవలూరు, కొడవలూరు మండలాల్లో ఈ పనులపై విచారణ జరిగింది. క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ఈ అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి అధికారులు, ప్రజాప్రతినిధులపై చర్యలు చేపట్టాలని విడవలూరుకు చెందిన ఇరువురు పెన్నా డెల్టా రైతులు న్యాయ పోరాటానికి దిగారు. జలవనరుల శాఖ పరిధిలో రూ.300కోట్ల అవినీతి జరిగిం దని హైకోర్టులో వేసిన రిట్‌పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇందులో రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శిని మొదటి ప్రతి వాదిగా చేర్చారు. రెండవ ప్రతివాదిగా తెలుగుగంగ ప్రాజెక్టు సిఇ, మూడవ ప్రతి వాదిగా జిల్లా జలవనరుల శాఖ ఎస్ఇ నాల్గవ ప్రతివాదిగా నెల్లూరు సెంట్రల్ డివిజన్ ఇఇ, అయిదవ ప్రతివాదిగా నెల్లూరు డ్రైనేజీ డివిజన్ ఇఇ, ఆరవ ప్రతివాదిగా జిల్లా కలెక్టర్‌ను చేర్చారు. మంగళవారం ఈ పిటిషన్ విచారణకు హైకోర్టు నిర్ణయం తీసుకుంది.

## రూరల్‌లో పూర్తిస్థాయి సిమెంట్‌రోడ్లు

**ఆదాల ప్రభాకరరెడ్డి**

నెల్లూరు రూరల్ మండలంలోని గ్రామాల్లో పూర్తిస్థాయిలో సిమెంట్‌రోడ్ల వేయడం జరుగుతుందని, ఆ మేరకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని, 2019 నాటికి ఈ పనులన్నీ పూర్తిచేయనున్నామని మాజీమంత్రి, టిడిపి రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకరరెడ్డి అన్నారు. రూరల్‌మండలంలోని గొల్లకందుకూరులో ఈ నెల 4న రూ.60 లక్షల ఎస్డీఆర్ నిధులతో నిర్మించిన సిసి రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ, రూరల్ మండలంలో పదికోట్ల రూపాయల వ్యయంతో నీరు-చెట్టు కార్యక్రమం ద్వారా చెరువులను, పంటకాలువలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. సంగం బ్యారేజీ, కనుపూరు కాలువ లైనింగ్ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు సూచించామన్నారు. ఆ పనులను సకాలంలో పూర్తిచేయకుంటే రీ-టెండర్లను పిలిచేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆదాల కొత్తవెల్లంటి పాతవెల్లంటి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇటీవల అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధితుడు పొట్లూరి పోలయ్యకు 5వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిసిసిబి డైరెక్టర్ కోడూరు కమలాకరరెడ్డి, వేదగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఛైర్మన్ మల్లినేని వెంకటేశ్వర్లు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఆనం జయకుమార్‌రెడ్డి, వేమిరెడ్డి అశోక్‌రెడ్డి, రామ్‌గోపాల్, స్వర్ణా వెంకయ్య, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధన

నెల్లూరు మూలాపేటలోని గురునిలయంలో ఈ నెల 7న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి 34వ ఆరాధన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి శిష్యుడు, శ్రీవారి పాదరేణువు మాకాని వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆరాధనోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గురునిలయంలోని మందిరంలో కొలువైవున్న శ్రీ వెంకయ్యస్వామివారికి ప్రత్యేక పూజలు,హోమాలు, సహస్రనామార్చనలు నిర్వహించి, భజనలు, అఖండనామ సంకీర్తనలు చేశారు. స్వామివారి ఉత్సవ విగ్రహంతో వేడుకగా నగరోత్సవం నిర్వహించారు. భక్తులందరికీ అన్నప్రసాద వితరణ గావించారు. ఈ ఉత్సవాల్లో స్థానిక భక్తులతో పాటు, గాలిపాళెంలోని వెంకయ్యస్వామి ఆలయం నిర్వాహకులు శ్రీహరిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కందమూరులో పశువైద్య శిబిరం

నెల్లూరు రూరల్ మండలంలోని కందమూరులో ఈ నెల 3న ప్రత్యేక పశువైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి పశువులకు వైద్య చికిత్సలు చేశారు. ఈ శిబిరాన్ని ఎంపిపి సిద్దపురెడ్డి కలిగిరమ్మ ప్రారంభించగా, తిరుపతి వెటర్నరీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ యుగంధర్‌కుమార్, జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్‌కుమార్, ఏ.డిలు వెంకటస్వామి, రమేష్‌బాబు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డిలతో పాటు గ్రామ సర్పంచ్ మహేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 16 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో అత్యధికంగా ధాన్యం పండే 16 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని మద్దతు ధర అమలు కమిటీ సభ్యులు తెలియజేశారు. కొడవలూరులోని తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మేలు రకం ధాన్యం క్వింటాలు ధర 1450 రూపాయలని, సాధారణ రకం ధాన్యం క్వింటాలు 1410 రూపాయలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని వారు స్పష్టం చేశారు. కనీస మద్దతు ధర అమలు జరిగేలా చూసేందుకు ప్రత్యేక కమిటీని నియమించామని, ఈ కమిటీ జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు చేసినవారి వద్ద సంబంధిత రైతు సంతకంతో కూడిన ఓచర్ తప్పనిసరిగా వుండాలని, ఆ ఓచర్‌లో కనీస మద్దతుధర కంటే తగ్గించికొన్నట్లు వుంటే కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ మద్దతుధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఏజిపిఒ రవి, సివిఎస్‌డిటిలు కృష్ణప్రసాద్, ప్రమీల్‌తో పాటు తహశీల్దార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**సింహపురి సమాచారం**

**ఆత్మకూరు సిఐకి**
## ఉమేష్‌చంద్ర అవార్డు

ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న షేక్ ఖాజావలికి ఎంతో ప్రతిష్టాత్మకమైన ఉమేష్‌చంద్ర మెమో రియల్ అవార్డు లభించింది. ఎర్రచందనం అక్రమరవాణాను అరికట్టడంలో ఆయన చూపిన చొరవకు, ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. గుంటూరుజిల్లాలోని తెనాలిలో ఈ నెల 4న జరిగిన కార్యక్రమంలో డిజిపి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకు న్నారు. ఈ సందర్భంగా సిఐని ఆత్మకూరు డిఎస్పీ, ఎస్‌ఐలు అభినందించారు.

**11న రాష్ట్ర**
## బొందిలి సంఘం సమావేశం

ఈ నెల 11వ తేదీన ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం రాష్ట్ర సర్వసభ్య సమా వేశం మరియు జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఈ సమా వేశంలో రాష్ట్ర, జిల్లా, నెల్లూరు పట్టణ శాఖలకు ఎన్నికలు కూడా జరుగుతాయని జిల్లా బొందిలి సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.కోటిసింగ్, ఎ.నాగేంద్ర సింగ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఇందిరాభవన్‌లో జరిగే ఈ సమావేశానికి రాష్ట్రం నలుమూలల నుంచి నాయకులు తరలివస్తారని పేర్కొన్నారు. బొందిలి కులాన్ని ఓబిసి జాబితాలో చేర్పించడమే సంఘం ప్రధాన ఉద్దేశమని వారు తెలిపారు. జిల్లాలోని బొందిలి సంఘం నాయకులు, బొందిలి కులస్తు లందరూ పాల్గొని సమావేశాన్ని జయ ప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# మన స్వాతంత్ర్యవీరులు

(గత వారం తరువాయి)

ఉద్యమాల పురిటిగడ్డ, పోరాటాల పుట్టినిల్లు మన నెల్లూరు. మొలగొలుకులు మొలచిన జిల్లాగా, మొనగాళ్లకు నెలవైన ఖిల్లాగా ప్రసిద్ధి మన నెల్లూరుజిల్లా. స్వాతంత్ర్య సమరంలో పాల్గొని బ్రిటీష్ ముష్కరులపై తిరుగుబాటు చేసి జైళ్ళపాలైన ఎందరో పోరాటవీరులు మన జిల్లాలో వున్నారు. ఆనాటి సమరంలో పాల్గొన్న ధీరోదాత్తుల వివరాలను పొందుపరుస్తూ గతంలో "హూస్ హూ ఆఫ్ ఫ్రీడమ్ స్ట్రగుల్ ఇన్ ఆంధ్రప్రదేశ్" అన్న పేర రాష్ట్రంలో స్వాతంత్ర్య సమరోద్యమంలో పాల్గొన్న వేలాది మందికి సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఓ సమగ్ర గ్రంథాన్ని మూడు సంపుటాలుగా ముద్రించింది. వాటిలో మూడవ సంపుటిలో నెల్లూరుజిల్లాకి సంబంధించిన దాదాపు 400మందికి పైగా సమరవీరుల ప్రాథమిక సమాచారాన్ని 'లాయర్' సేకరించగలిగింది. గత మూడు వారాల నుండి వారి పేరు, ఊరు వివరాలను 'లాయర్' పాఠకులకు అందిస్తున్నాం.

**గమనిక :** ఈ మహనీయులకు సంబంధించిన వారి కుటుంబసభ్యులు కాని, లేదా వారి వారసులు గాని... తమ వద్ద క్రింది వారికి సంబంధించిన సమాచారం కాని, వారి ఫోటోలు గాని వుంటే మాకు పంపగలరని మనవి. వీరందరికి సంబంధించిన సమాచారాన్ని సాధ్యమైన వరకు సేకరించి పాఠకులకు, రేపటి తరానికి అందించాలని సాహసిస్తోంది 'లాయర్'. ఆదరించండి, ఆశీర్వదించండి. మీకు తెలిసిన వివరాలను వెంటనే మాకు నేరుగా గాని, లేక ఇ-మెయిల్ roopagroup@yahoo.com ద్వారా గాని పంపవలసినదిగా విజ్ఞప్తి.

మన జిల్లాలోని స్వాతంత్ర్యసమరయోధుల పేరు, ఇంటిపేరు, వూరు, వారి స్వస్థలాలను సూచిస్తూ అప్పటి పాత తాలూకాల్లోని ఆయా వూర్ల పేర్లతో అకారాది క్రమం(ఆల్ఫాబెటికల్ ఆర్డర్)లో రూపొందించిన జాబితా ఇది. గమనించగలరు.

| క్ర.సం | పేరు | ఊరు |
|---|---|---|
| 225 | రమణమ్మ దుర్భా | నెల్లూరు |
| 226 | రమణమ్మ పొన్నలూరు | నెల్లూరు |
| 227 | రమణారెడ్డి మారంరెడ్డి | గూడూరు |
| 228 | రమణారెడ్డి తిమ్మిరెడ్డి | అల్లూరు కోవూరు తాలూకా |
| 229 | రమణారెడ్డి ఉచ్చూరు | యల్లాయపాళెం కోవూరు తాలూకా |
| 230 | రమణయ్య కంకణాల | వెంకటగిరి |
| 231 | రమణయ్య నాగిశెట్టి | గూడూరు |
| 232 | రమణయ్య తన్నీరు | గూడూరు |
| 233 | రామసుబ్బయ్య రాళ్ళపల్లి | నెల్లూరు |
| 234 | రామసుబ్బయ్య యనమండ్ర | అల్లూరు కోవూరు తాలూకా |
| 235 | రామస్వామి పసుపులేటి | మదమనూరు నెల్లూరు తాలూకా |
| 236 | రామతిలకమ్మ కావేటి | వెంకటగిరి |
| 237 | రామయ్య గూడూరు | కావలి తాలూకా |
| 238 | రామయ్య కడియం | యల్లాయపాళెం కోవూరు తాలూకా |
| 239 | రామయ్య శనగల | కొత్తవంగల్లు కోవూరు తాలూకా |
| 240 | రామిరెడ్డి తిక్కవరపు | నెల్లూరు |
| 241 | రామిరెడ్డి తిప్పారెడ్డి | జలదంకి కావలి తాలూకా |
| 242 | రాణెప్పరెడ్డి వదూరు | వెంకటగిరి |
| 243 | రంగభాష్యం నాలిశెట్టి | సూళ్ళూరుపేట |
| 244 | రంగాచారి ఎన్‌వి | గూడూరు |
| 245 | రంగాచార్యులు మాడభూషి | వెంకటగిరి |
| 246 | రంగప్పనాయుడు బి | వెంకటగిరి |
| 247 | రంగారెడ్డి అల్లూరు | అల్లూరు కోవూరు తాలూకా |
| 248 | రంగారెడ్డి ఇసనాక | యల్లాయపాళెం కోవూరు తాలూకా |
| 249 | రంగారెడ్డి కొల్లు | గోగులపల్లి కోవూరు తాలూకా |
| 250 | రంగారెడ్డి నెల్లూరు | నెల్లూరు |
| 251 | రంగయ్య చిలుకోటి | సూళ్ళూరుపేట |
| 252 | రంగయ్య దేశభట్ల | కావలి |
| 253 | రంగయ్య కారంశెట్టి | నెల్లూరు |
| 254 | రంగయ్య వెల్లూరు | కావలి |
| 255 | రత్నంనాయుడు పి | గూడూరు |
| 256 | రుక్మిణమ్మ కోబాక | వెంకటగిరి |
| 257 | సాంబయ్య పేరూరు | కావలి తాలూకా |
| 258 | సంపత్ అయ్యంగార్ | నెల్లూరు |
| 259 | సామ్రాజ్యం పి.డి | కావలి తాలూకా |
| 260 | శంకరదాస వెంటా | వెంకటగిరి |
| 261 | శంకరరెడ్డి బసవారెడ్డి | ఇందుపూరు కోవూరు తాలూకా |
| 262 | శంకరరెడ్డి రేబాల | మోపూరు కోవూరు తాలూకా |
| 263 | శంకరరెడ్డి వాకాటి | బుచ్చిరెడ్డిపాళెం కోవూరు తాలూకా |
| 264 | శంకరయ్య అద్దంకి | నార్త్‌మోపూరు కోవూరు తాలూకా |
| 265 | శంకరయ్య పి | వెంకటగిరి |
| 266 | సరోజిని చీళ్ళ | వెంకటగిరి |
| 267 | శేషాచెలంశెట్టి కొనగళ్ళ | ఇందుపూరు కోవూరు తాలూకా |
| 268 | శేషాద్రిరెడ్డి దేవరం | లేగుంటపాడు కోవూరు తాలూకా |
| 269 | శేషాద్రిరెడ్డి గూడూరు | నెల్లూరు |

(మిగతా 11వ పేజీలో)

# ఆనందోత్సవంగా స్వర్ణభారత్ 15వ వార్షికోత్సవం

*కేంద్ర పట్టణాభివృద్ధి శాఖామంత్రి మన ముప్పవరపు వెంకయ్యనాయుడు మూడో బిడ్డ 15వ పుట్టినరోజు వేడుక ఈ నెల 4వ తేదీన ఎంతో ఆనందంగా జరిగింది. వెంకయ్యకేంటి... 15ఏళ్ల బిడ్డేంటి... ఆయనకు ఉన్నది ఇద్దరు బిడ్డలే కదా... ఈ మూడో బిడ్డ ఎక్కడిదని ఆయనపై అనుమాన పడకండి. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆయనకు మూడోబిడ్డ లాంటిదే! మొదటి ఇద్దరు బిడ్డల పుట్టినరోజులప్పుడు ఆయన వారి వద్ద ఉంటాడో లేదోగాని మూడోబిడ్డ స్వర్ణభారత్ ట్రస్ట్ పుట్టినరోజు నాడు మాత్రం ఖచ్చితంగా వస్తాడు. తాను రావడమే కాదు, జాతీయ స్థాయి అతిరథులను అతిథులుగా రప్పించి ఆ పుట్టినరోజు వేడుకను ఎంతో వైభవంగా జరిపిస్తుంటాడు.*



15ఏళ్ల క్రితం పురిటిబిడ్డ స్వర్ణభారత్ ట్రస్ట్. ఒక గ్రామమైన వెంకటాచలంలో ఏంటి... ఈ ట్రస్ట్ పెట్టడమేంటి అని అప్పుడు చాలామంది అనుకున్నారు. కాని ఈ 15ఏళ్లలోనే ఆ ట్రస్ట్ దేశానికే తలమానికంగా ఎదిగింది. ముఖ్యంగా గ్రామీణ యువతకు ఉపాధి, నైపుణ్యతలలో శిక్షణ, విద్యా, వైద్య సేవా కార్యక్రమాలలో ఆదర్శప్రాయంగా నిలిచింది. ఈ స్వర్ణభారత్ ట్రస్ట్‌ను వెంకయ్య తండ్రిలా దగ్గరుండి చూసుకోలేక పోయినా, ఆ లోటును తెలియకుండా ట్రస్ట్‌ను తన తోబుట్టువులా ప్రేమగా చూసుకుంటూ, ఈ ట్రస్ట్‌కు జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావడంలో వెంకయ్య తనయ శ్రీమతి ఐ.దీపావెంకట్ చేసిన కృషి అనిర్వచనీయం. స్వర్ణభారత్ ట్రస్ట్ 15వ వార్షికోత్సవ వేడుకలు ట్రస్ట్ ప్రాంగణంలో ఈనెల 4న కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు అధ్యక్షతన జరుగగా లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, కేంద్ర పెట్రోలియం శాఖ సహాయమంత్రి ధర్మేంద్రప్రదాన్, ఒలింపిక్స్ బ్యాడ్మింటన్ రజత పతక విజేత పి.వి.సింధు, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్‌లు ఈ పండుగలో పాలుపంచుకున్నారు. లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ తన ప్రసంగంలో నేటి ఎన్డీఏ ప్రభుత్వం చేపడుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలకు 15ఏళ్ల క్రిందటే స్వర్ణభారత్ ట్రస్ట్ శ్రీకారం చుట్టి ఉండడం అద్భుతమన్నారు. స్వార్థం లేని స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు దేశవ్యాప్తం కావాలని ఆమె ఆకాంక్షించారు. ఒలింపిక్స్ విజేత సింధు, టెన్నిస్ క్రీడాకారిణి సానియామిర్జా, స్వర్ణభారత్ ట్రస్ట్ దీపాలను చూస్తే దేశంలో మహిళాశక్తి ఏ స్థాయిలో వుందో అర్థమవుతోందన్నారు. వెంకయ్య నాయుడు తన ప్రసంగంలో కన్నతల్లి, పెరిగిన ఊరు, మాతృభూమిని, చదువు చెప్పిన గురువు గురించి మరచిపోవద్దన్నారు. అధికారంలో ఉండి చేసే సేవ కంటే స్వచ్ఛంధంగా చేసే సేవ ఎక్కువ ఆనందాన్నిస్తుందన్నారు. కొంతమంది మిత్రుల సహకారంతో ట్రస్ట్‌ను నడిపిస్తూ, పదిమందికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్న ఆత్మసంతృప్తిని పొందుతున్నామన్నారు. నెల్లూరు రూరల్ మొగళ్లపాలెం వద్ద 150 ఎకరాలలో క్రీడాగ్రామం ఏర్పాటు చేస్తున్నామని, దీనికి తొలివిడతలో 10కోట్లు మంజూరయ్యాయని ఆయన చెప్పారు. ట్రస్ట్‌లో సేవాకార్యక్రమాల నిర్వహణ కోసం తన కూతురు దీపమ్మ పడుతున్న కష్టం చూస్తుంటే తనకు ఎంతో గర్వంగా ఉంటుందని వెంకయ్య సంతోషంగా చెప్పారు. ఈ కార్యక్రమానికి ఇంకా ఎంపీలు వరప్రసాద్, గోకరాజు గంగరాజు, హరిబాబులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రస్ట్ 15వ వార్షికోత్సవ సావనీర్‌ను అతిథుల చేతుల మీదుగా విడుదల చేశారు. సభకు ముందు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే రీతిలో అక్షర విద్యాలయ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా అక్షర విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒలింపిక్స్ రజత పతక విజేత పి.వి. సింధు, కోచ్ గోపీచంద్‌లను ఘనంగా సత్కరించారు.



# నింగిని ముద్దాడింది




*పిఎస్ఎల్‌విలా చెప్పినట్లు నడుచుకునే బుద్ధిమంతుడిలా కాకుండా అప్పుడప్పుడూ మొండికేస్తూ, తన ప్రయాణంలో పక్కచూపులు చూస్తూ, కొన్నిసార్లు పైకి ఎగిరినట్లే ఎగిరి సముద్రంలోకి డైవ్‌కొడ్తూ, బుద్ధిమంతుడిలా కాకుండా మొద్దబ్బాయిలా తయారై ఇస్రో శాస్త్రవేత్తలనే టెన్షన్ పెడుతున్న జిఎస్ఎల్‌వి ఎట్టకేలకు వారి దారిలోకి వచ్చింది. వారు చెప్పినట్లే బుద్ధిగా నడుచుకుని నిర్ణీత కక్ష్యలోకి చేరింది. అయినా కూడా చివరి నిముషాలలో టెన్షన్‌పెట్టి 40 నిముషాలు ప్రయోగాన్ని వాయిదా వేయించి, తన మొండితనాన్ని మరో సారి చాటుకుంది.*

ఈ నెల 8వ తేదీన నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం(షార్) నుండి వదిలిన జిఎస్ఎల్‌వి-ఎఫ్05 విజయవంతమైంది. సాయంత్రం 4.50గంటలకు మొదలైన ఈ ప్రయోగం నాలుగు దశలలో 17 నిముషాలలో పూర్తికాగా ఈ రాకెట్ ద్వారా 3211కిలోల బరువుగల ఇన్‌శాట్-3 డిఆర్ ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలో ప్రవేశ పెట్టారు. వాతావరణ అధ్యయనం కోసం, సముద్రయాన, విమానయాన సైనిక అవసరాల కోసం ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. ఇస్రో ఛైర్మన్ కిరణ్‌కుమార్, షార్ డైరెక్టర్ కున్హికృష్ణన్‌లతో పాటు శాస్త్రవేత్తలు ఈ ప్రయోగాన్ని వీక్షించారు. ప్రయోగం విజయవంతం కాగానే శాస్త్రవేత్తలు హర్షధ్వానాలు చేస్తూ అభినందనలు తెలుపుకున్నారు.

# ఆత్మీయ సమాజం కోసం.. ఏకతా యాత్ర

సంస్కృతి, సంప్రదా యాలను ప్రతిబింబిస్తూ సమాజంలోని అన్ని వర్గాలను భాగస్వామ్యం చేస్తూ సాగే గణేష్ సందర్శనా ఏకతా యాత్ర భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నాయకురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి అన్నారు. వినాయక చవితి సందర్భంగా మూడురోజులు నెల్లూరు నగరంలో విశేషంగా నిర్వహించే గణేష్ సందర్శన ఏకతా యాత్ర ప్రారంభం సందర్భంగా సోమవారం నెల్లూరు టౌన్‌హాల్లో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. హిందూ దేవాలయ పరిరక్షణ సమితి పీఠాధిపతి కమలానంద భారతి స్వామీజీ మాట్లాడుతూ అంతరాలు లేని ఆత్మీయ సమాజాన్ని నిర్మించుకునేందుకే గణేష్ సందర్శనా ఏకతా యాత్రను చేపడుతున్నట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, యాత్ర కన్వీనర్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరులో



అన్ని వర్గాలను ఏకం చేస్తూ సమాజ సంఘటితం కోసం గత మూడేళ్ల నుంచి సింహపురి గణేష్ సందర్శన ఏక్‌తాయాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తప్పెట్లు, కోలాటాలు, భాజాభజంత్రీలు, కీలుగుర్రాల నృత్యాలు, పండరీ భజనలు, కర్రసాము విన్యాసాలతో సింహపురి గణేష్ సందర్శన ఏక్‌తాయాత్ర సాగింది.




## ఫాస్ట్‌టాగ్‌తో.... టోలు తిప్పల నుండి విముక్తి

### భారతదేశమంతా అమలయ్యింది

నిత్యం హైవేలలో ప్రయాణించే వారికి గంటలకొద్దీ టోలుగేట్ల వద్ద నిరీక్షించే అవసరం ఇకలేదు. అభివృద్ధి చెందిన దేశాలలోలాగా మనకి కూడా ఇటిసి(ETC) ఎలక్ట్రానిక్ టోల్ కలక్షన్ పద్ధతి అమలులోకి వచ్చేసింది. FASTAG పేరుతో వాహనం ముందుభాగంలో అంటించే ఎలక్ట్రానిక్ డిజిటల్ స్టిక్కర్ ద్వారా టోల్‌గేట్ దగ్గర ఒక్క క్షణం కూడా ఆగకుండా వెళ్ళిపోవచ్చు.




ఐసిఐసిఐ బ్యాంకు వారి సౌజన్యంతో ఇచ్చే ఫాస్ట్‌టాగ్ స్టిక్కర్

ఐసిఐసిఐ బ్యాంకు ద్వారా ఈ పద్ధతిని అమలు చేస్తున్న ప్రైవేట్ కాంట్రాక్టర్లు భారతదేశంలో ఎక్కడ ఈ స్టిక్కర్ తీసుకున్నా భారతదేశమంతా ఉపయోగపడేలా అవకాశం కల్పించారు. ఈ పద్ధతి ఇప్పటికే అమలులోకి వచ్చింది. ఎక్కడైనా ప్రభుత్వ రంగం నిర్వహించే టోల్‌గేట్లలో తప్ప మిగిలిన అన్ని ప్రైవేట్ టోల్‌గేట్ల వద్ద ఈ స్టిక్కర్ వున్న వారికి ప్రత్యేకలైనును ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు మన అకౌంటును సెల్‌ఫోన్ సిమ్ తరహాలో రీచార్జ్ చేసుకుంటే మనం టోలుగేట్ దాటి వెళ్లగానే మన అకౌంట్‌లో డబ్బు మినహాయించబడి సెల్‌ఫోన్‌లో మెసేజ్ వచ్చేస్తుంది.

వందల మైళ్ల ప్రయాణం చేసి టోల్‌గేట్ల వద్ద తలలు పట్టుకుంటున్న వారికి ఇది మంచి ఊరట. ఈ స్టిక్కర్ కావలసిన వాళ్ళు గూడూరు సమీపంలోని బూదనం టోల్‌గేటు వద్దగల ఆఫీసులో సంప్రదించి వాహన యజమాని డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు, వాహన సీబుక్ జెరాక్స్ కాపీ, యజమాని ఫోటో ఇచ్చి రూ.500 చెల్లిస్తే అప్పటికప్పుడే స్టిక్కర్ అతికించేస్తున్నారు. భారతదేశంలో ఎక్కడ స్టిక్కర్ తీసుకున్నా ఇది భారతదేశమంతా పనిచేస్తుంది.

బూదనం వద్దకు వెళ్లలేని వాళ్ళు TOLL అని స్పేస్ ఇచ్చి ఏరియా పిన్‌కోడ్‌ను ఎంటర్‌చేసి మీ పేరుతో సహా 5676766కి ఎస్ఎంఎస్ చేస్తే ICICI బ్యాంక్ ఏజెంటు మిమ్మల్ని సంప్రదించి అవసరమైన డాక్యుమెంట్లు సేకరించి మీకు పూర్తి స్థాయిలో సేవలు అందించి ఎలక్ట్రానిక్ డిజిటల్ స్టిక్కర్‌ని మీకు చేరుస్తాడు. ఇంకెందుకు ఆలస్యం... టోలు బాధితులంతా వెంటనే స్పందించండి. అతి సౌలభ్యంగా వున్న ఈ సదుపాయాన్ని వినియోగించుకోండి.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# 'ప్రభా'తం

ఎక్కడో అల్బేనియాలోని మేసిడోనియాలో జన్మించింది..భారత్‌లోని కోల్‌కతా నగరానికి వచ్చి స్థిరపడింది. మానవసేవే మాధవ సేవగా భావించి..జీవితాన్నంతా రోగులు..దీనజనుల సేవకే అంకితం చేసి..విశ్వమంతా మానవతా కాంతులను ప్రకాశింపజేసింది. ప్రేమే..పరమధర్మంగా..సేవే జీవితకర్తవ్యంగా ఎంచి మానవతా స్ఫూర్తిదీప్తులతో జగతిలో సేవాభావపు వెలుగుదివ్వెలను వెలిగించింది. తన జీవితాన్నే త్యాగానికి బాటగా పరచింది. విశ్వప్రేమను కాంక్షిస్తూ..మానవత్వంలోనే దైవత్వం వుందని ప్రపంచానికంతా చాటింది. ఆజన్మాంతం రోగార్తుల సేవలోనే తరించింది. 'అమ్మ' అనే అమృతతుల్యమైన మాటను విశ్వజనీనం చేస్తూ విశ్వజననిగా ప్రపంచంచే ఎంతో అరుదైన కీర్తిని అందుకుంది. నిరంతరం రోగార్తులను ఆదుకోవడమే దేవుని సేవగా భావించి..పవిత్రమైన క్రీస్తు ప్రేమసందేశాన్ని లోకానికి చాటిచెప్పిన దయామయి ఆమె. ఆమె ఎవరో కాదు..ఒక మహోన్నత మానవతా శిఖరం. మానవరూపం దాల్చిన కరుణామృత హృదయం..ఆమె జీవితమంతా సేవాభరితంగా..ఎంతో పవిత్రంగా సాగే పావన గంగాజల ప్రవాహం. ఆమె మరెవరో కాదు..మహా మానవీయ మూర్తి..మదర్ థెరిసా!..ఇప్పుడు మరెంతో విశిష్టమైన రీతిలో 'పునీత'గా..మహిమాన్వితగా ఆమె స్ఫూర్తి ప్రఖ్యాతిపొందడం ప్రపంచానికే గర్వకారణం. అనాధలను, అభాగ్యులను, రోగార్తులను ఆదుకున్న ఆ మానవతాదీప్తికి రోమన్ కాథలిక్ చర్చ్ 'సెయింట్ హుడ్' (పునీత హోదా) ప్రకటించి..తనను తాను గౌరవించుకుంది. ఈ నెల 4వ తేదిన రోమ్‌లోని వాటికన్ సిటీలో ప్రపంచం నలుమూలల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన క్రైస్తవ మతపెద్దలు, వేలాదిగా వచ్చిన ప్రజలు, 13 దేశాలకు చెందిన అధినేతలు, థెరిసా ఆర్డర్‌కు చెందిన నన్స్ మధ్య, వారందరి హర్షధ్వానాల మధ్య, ఉప్పొంగిపోతున్న పులకిత హృదయాల మధ్య.. పోప్ ఫ్రాన్సిస్ మానవతా మూర్తి మదర్ థెరిసాకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, అపూర్వమైన 'సెయింట్ హుడ్' (పునీత) హోదాను ప్రకటించడంతో ఆ మానవతాశిఖరాన్ని ప్రపంచమంతా మరోసారి తలచుకుని సగర్వంగా జయజయ ధ్వానాలు చేసింది. 'ఇది మూర్తీభవించిన మాతృప్రేమకు, అనాధలను-పేదలను అక్కున చేర్చుకున్న సేవాతత్పరతకు అందిస్తున్న గౌరవమని' పోప్ ఫ్రాన్సిస్ ఈ సందర్భంగా పేర్కొనడం ద్వారా ఆ సేవామూర్తి సేవలకు మరింత గౌరవం లభించినట్లయింది. మదర్ థెరిసాకు సెయింట్‌హుడ్ బహుకరించడం దేశానికే గర్వకారణమని, భారతరత్న, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత అయిన మదర్ థెరిసాకు ఇది గొప్పగౌరవమని ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు కూడా. 1910 ఆగష్ట్ 26న మేసిడోనియాలోని స్కోప్జేలో జన్మించిన థెరిస్సా, పద్దెనిమిదేళ్ళ వయసులోనే క్రైస్తవ సన్యాసినిగా, సిస్టర్ థెరిస్సాగా మారి తన సేవా కార్యక్రమాలను ప్రారంభించింది. ఆమె అసలు పేరు ఆగ్నెస్ గోన్హా బోజాక్షియు. 1928లో ఐర్లండ్‌లో కేథలిక్ నన్ (సిస్టర్ మేరీ థెరిసా)గా వుంటూ, ఆ తర్వాత 1929లో భారత్‌కు వచ్చి కోల్‌కతాలో మిషనరీ, ఛారిటీ సేవా కార్యక్రమాలను ప్రారంభించింది. 1948లో భారత పౌరసత్వాన్ని స్వీకరించింది. 1950లో మిషనరీ ఆఫ్ ఛారిటీని ప్రారంభించి, 1960 ప్రాంతంలో కుష్టువ్యాధి, అతిసార, క్షయవ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేక సేవాకేంద్రాలు ప్రారంభించింది. ఆమె విశిష్టసేవలకు గుర్తింపుగా 1979లో ఆ నిర్మల హృదయినికి విశ్వవిఖ్యాతమైన నోబెల్ శాంతి బహుమతి లభించింది. భారత ప్రభుత్వం ఆమెకు 'భారతరత్న' బిరుదునిచ్చి ఘనంగా సత్కరించింది. ఎందరో రోగార్తులకు అలుపెరుగక సేవలందించిన ఆ కారుణ్యమూర్తి 1997 సెప్టెంబర్ 5న కోల్‌కతాలో చివరిశ్వాస విడిచింది. ఆ పవిత్రమూర్తి మృతికి లోకం శోకంతో తల్లడిల్లిపోయింది. చివరిశ్వాస వరకు ఆమె రోగపీడితుల సేవలోనే గడిపింది. 'ఇతరుల కన్నీరు తుడిస్తే.. నీ కన్నీటిని భగవంతుడు తుడుస్తాడనే' దృఢవిశ్వాసంతో, మానవసేవే మాధవసేవగా మనసావాచా నమ్మి నిరంతరం దీనజనుల సేవకే జీవితాన్ని అంకితం చేసిన దయామయి ఆమె. కేవలం క్రైస్తవమతావలంబకులనే కాక ఆమె సేవాస్ఫూర్తి విశ్వవ్యాప్తంగా సకల మానవాళినీ మంత్రముగ్ధం చేసిందనడంలో అతిశయోక్తి లేదు. మదర్ థెరిసా సేవానురక్తితో ప్రారంభించిన మిషనరీస్ ఆఫ్ చారిటీస్, నిర్మల హృదయభవన్ వంటి సంస్థలు ఇప్పటికీ 140 దేశాల్లో దీనజనులకు నిరుపమానమైన సేవలందిస్తూనే వున్నాయంటే మదర్ థెరిసా సేవా భావం ఎంత విశ్వవ్యాప్తమైనదో తేటతెల్లమవుతుంది. విశ్వమానవాళికి 'అమ్మ'గా ఆమె పంచిన ప్రేమామృత సేవలు అమోఘం..నిరుపమానం. ఆకలైనప్పుడు అన్నం పెట్టే అమ్మ ఎంత గొప్పదో.. ఆపదలో చేయందించి కన్నీరు తుడిచే అమృతమూర్తి కూడా అంత గొప్పదే.. అందుకే థెరిస్సాకు 'మదర్' అనే సార్థక నామధేయం స్థిరపడిపోయింది. వ్యాధులబాధలతో, నీల్గింకిన కళ్ళతో సొమ్మసిల్లిపోయి..అసహాయంగా మృత్యుద్వారాల వైపు చూస్తూ నిస్సహాయస్థితిలో పడివున్న ఎందరో రోగులను..మరణరోగులను ఓదార్చి వారిని అమ్మలా అక్కున చేర్చుకుని సేవలందించిన మహోన్నత మానవతామూర్తి మదర్ థెరిస్సా!.. దైవం మానుష రూపేణా..అన్నట్లుగా తీవ్ర వేదనలో వున్న ఎందరో రోగార్తులను మదర్ థెరిసా సాక్షాత్తూ దైవస్వరూపంలా వచ్చి ఆదుకుంది. ఎంతో మహిమాన్వితమైన ఆమె సేవలకు ప్రపంచమే అచ్చెరువొందింది.

ఆ అమృతమూర్తికి ప్రపంచవ్యాప్తంగా ప్రజల హృదయాల్లో వున్న అపూర్వమైన స్థానం నాటికీ..నేటికీ.. ఏనాటికీ చెరగనిది. అది ఆచంద్రతారార్కమైనది.. శాశ్వతమైనది. త్యాగం, ప్రేమ, దయ, కరుణార్ద్రభావాలు మూర్తీభవించిన దివ్యస్వరూపం ఆమె. అలాంటి దివ్యమూర్తికి.. ఆ మహోన్నత సేవాదీప్తికి ఇదే..వందనం! అమ్మకు పాదాభివందనం!.. ఆ మహా మానవతా శిఖరానికి సదా శిరసాభివందనం!

## 'అమ్మ'కు వందనం!



ఆమె.. ఒక మహోన్నత మానవతా శిఖరం. మానవరూపం దాల్చిన కరుణామృత హృదయం.. ఆమె మరెవరో కాదు.. జీవితాన్నంతా రోగార్తులు, దీనజనుల సేవకే అంకితం చేసిన మహా మానవీయ మూర్తి.. మదర్ థెరిసా! త్యాగానికి.. సేవాభావానికి ప్రతీకగా నిలచి తన సేవాస్ఫూర్తితో జగతికి వెలుగుబాటలు పరచిన దయామయి ఆమె.. ఆ దివ్యమూర్తికి విశ్వవిఖ్యాతమైన సెయింట్‌హుడ్ (పునీత) అనే విశిష్టమైన గౌరవం లభించడం ప్రపంచానికే గర్వకారణం.

# ఉత్సాహంగా ఓనం సంబరాలు



మళయాళీల సంప్రదాయ ఓనం పండుగను కేరళలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న జరుపుకుంటారు. పదిరోజులు ముందుగా ఈ నెల 4వ తేదీ ఆదివారం జిల్లాలోని మళయాళీలు నెల్లూరు టౌన్‌హాల్లో కుటుంబసమేతంగా పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.

కేరళ సంప్రదాయ పుష్పముగ్గులను కనులవిందుగా తీర్చిదిద్ది వేడుకల్లో పాల్గొన్న ముఖ్యఅతిథులకు యువతులు స్వాగతం పలికారు. నెల్లూరుజిల్లా మళయాళీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.కె.నందకుమార్ ఆధ్వర్యంలో వేడుకలను అఖిలభారత మళయాళ సంఘ ప్రాజెక్టు ఛైర్మెన్ ఎం.ఎ.సలీమ్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రకాశం చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి సి.ఎస్.శివరామన్, కోశాధికారి ఆర్.టి.పీతాంబరన్ పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో అఖిలభారత సంఘ ఉపాధ్యక్షుడు ఎం.డి.విజయకుమార్, విజయవాడ సంఘ అధ్యక్షుడు ఎస్.సునీల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మురుగన్, మాజీఅధ్యక్షుడు డేవిస్ కోట్టి, డాక్టర్ ఎన్.శ్రీవాత్సవ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ మళయాళీలు ఐక్యంగా కలిసిమెలిసి ఉంటూ ప్రతి ఏడాది ఇదేవిధంగా సంబరాలను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఈ వేడుకల్లో మళయాళీ సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు వేడుకగా జరిగాయి. సంప్రదాయ రీతిలో 'తిరువాది రకలి', 'ఒప్పన'లతో పాటు శాస్త్రీయ, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలను యువతీయువకులు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ వేడుకల్లో పాల్గొన్న కళాకారులందరికీ జ్ఞాపికలు అందజేశారు. ఇంటర్, పదవ తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. డ్రా పద్ధతిలో విజేతలైన 50మంది మళయాళీ మహిళలకు చీరలను అందజేశారు. కార్యక్రమాన్ని సంఘం జాయింట్ సెక్రటరి నిర్మల్, సభ్యులు సతీష్ పర్యవేక్షించారు.



# చెట్లు పెంచడమూ ఓ ఉద్యమమే!



ఈ నెల 4న నెల్లూరులోని ఎస్సీ వెల్ఫేర్ బాలుర వసతి గృహంలో మొక్కలు నాటే కార్యక్రమం వైయస్సార్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి.జయవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థి విభాగం అంటే కేవలం పోరాటాలు, ఉద్యమాలు మాత్రమే కాదని, సేవా కార్యక్రమాలలో కూడా భాగస్వాములు కావాలన్న నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపు మేరకు ఇవాళ మొక్కలు నాటామన్నారు. ప్రతి హాస్టల్‌లో, ప్రతి పాఠశాల, కళాశాలలో విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా చేయాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 10వేల మొక్కలు పంపిణీ చేసి ప్రతి విద్యార్థి ఒక్కొక్క మొక్క నాటి భావితరాల భవిష్యత్తు కోసం తమ పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ విద్యార్థి విభాగం నగర ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, ముజమాయిల్, రాకేష్, నాయకులు అబీద్, అబ్బాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# సాక్ష్యాలు తారుమారు కావా?




అక్రమాస్తుల కేసులో జగన్‌పై ఆరోపణలు ఋజువుకాకుండానే 16నెలలు జైలులో పెట్టారు. 'ఓటు-నోటు' కేసులో చంద్రబాబు పాత్ర ఉందన్నది రాష్ట్రపతి నుండి సామాన్యుడి వరకు అందరికీ తెలుసు. ఈ సంఘటనలో చంద్రబాబు పాత్ర లేదని ఎవరినైనా గుండెలమీద చేతులు వేసుకుని చెప్పమనండి. అంతెందుకు ఎమ్మెల్యే స్టీఫెన్సన్ కొనుగోలుకు నేను ప్రయత్నించలేదని కాణిపాకం వినాయకుని గుడి ముందు చంద్రబాబును ప్రమాణం చేసి చెప్పమనండి. ఈ కేసులో చంద్రబాబుపై విచారణను నిలిపేయాల్సిన అవసరమేముంది. ముఖ్యమంత్రి హోదాలో ఈ కేసులో సాక్ష్యాలను ఆయన తారుమారు చేయలేదా? ప్రధానిని మొదలుకొని గవర్నర్, తెలంగాణ సీఎంలు ఈ కేసు విషయంలో వ్యవహరిస్తున్న తీరు న్యాయానికి సమాధి కట్టేలాగే వుంది.

**- ఎల్.చంద్రశేఖర్, కలువాయి.**

## కోర్టు ప్రాంగణంలో అనైతిక పనులు

నెల్లూరుజిల్లా కోర్టు ప్రాంగణంలోవున్న జూనియర్ క్రిమినల్ కోర్టు, ఇతర కోర్టుల్లో న్యాయశాఖ సిబ్బంది సాయంత్రం 6గంటలకే పనిముగించుకొని వెళ్లేవిధంగా జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ ఆదేశాలివ్వాలి. కొందరు సిబ్బంది పనివేళల్లో పనిచేయకుండా కావాలనే రాత్రివేళల్లో పనున్నట్లు అక్కడ వుంటూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రాత్రిపూట దండకాలు చేస్తున్నారు. జిల్లా జడ్జి దీనిపై దృష్టి పెట్టాలి.

**- వై. పెంచలయ్య, అడ్వకేట్, నెల్లూరు.**

## ఫేస్‌బుక్‌లలో అలాంటివి పెట్టొద్దు

సామాజిక మాధ్యమాలలో పెడుతున్న కొన్ని ఫోటోలు సమాజాన్ని ప్రభావితం చేసేవిగా ఉంటున్నాయి. ముఖ్యంగా ఉగ్రవాదులు, ఉన్మాదులు మనుషులను, ఆవులను, ఇతర జంతువులను చంపే విధానాన్ని వీడియోల రూపంలో పోస్ట్ చేస్తున్నారు. ఇవి చూడడానికే భయంకరంగా ఉంటున్నాయి. వీటిని చూసి అయ్యోపాపం అనే వాళ్లు చాలామందుంటే, ఇంకొందరు మాత్రం ఇలాంటి కిరాతకాలకు ఆకర్షితులై వారిలాగే క్రూరులుగా తయారవుతున్నారు. కాబట్టి ఇలాంటి పోస్ట్‌లు మంచి కంటే చెడుకే ఎక్కువగా దారితీస్తున్నాయి.

**సి. రాజీవి, నెల్లూరు.**

# సాంకేతిక పరిజ్ఞానంతో ఇళ్ల కట్టుబడి




బిఎంపిటిసి సంస్థ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వెంకటాచలంలోని సరస్వతీనగర్‌లో కట్టిన 36ఇళ్లను ఈ నెల 3వ తేదీన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖామంత్రి యం.వెంకయ్యనాయుడు ప్రారంభించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో, తక్కువ ఖర్చుతో ఈ సంస్థ ఇళ్ల నిర్మాణానికి 16 కొత్త పద్ధతులను ఆవిష్కరించిందని ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. జిప్సం, ఫైబర్‌లను ఉపయోగించి ఇళ్లు కట్టే విధానాన్ని దేశంలోనే తొలిసారిగా వెంకటాచలం వద్ద అమలు చేయడం జరిగిందన్నారు. భూకంపాలను సైతం తట్టుకునే విధంగా ఈ ఇళ్ల నిర్మాణం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి శిద్దా రాఘవరావు, తిరుపతి ఎంపి వరప్రసాద్, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కలెక్టర్ ముత్యాలరాజు, బిఎంపిటీసీ ఎం.డి.శైలేష్ అగర్వాల్, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఐ.దీపావెంకట్, బీజేపీ నాయకులు పి.సురేంద్రరెడ్డి, నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూమిని విలువలేని రోజుల్లో భూముల అమ్మకాలు, కొనుగోళ్లన్నీ నోటిమాటల మీదే జరిగాయి. భూములకు కొంచెం విలువ వచ్చాక నోటి మాటలు పోయి కాగితాలు, అగ్రిమెంట్ల మీద బేరసారాలు జరిగాయి. ఇప్పుడు భూములే బంగారంగా మారిన తరుణంలో భూ లావాదేవీలన్నీ పక్కా రిజిస్ట్రేషన్లు, లీగల్ ఒపీనియన్‌లతో జరుగుతున్నాయి. భూముల లావాదేవీలన్నీ ఇంత చట్టబద్ధంగా జరుగుతున్నా కూడా, భూవివాదాలు పెద్దఎత్తున తలెత్తుతున్నాయి. గొడవలు, మధ్యస్థాలు, బేరసారాలు, రాజీలు ఎక్కువవుతున్నాయి.

## నెల్లూరులో..
# భూ మాయగాళ్లు

భూకబ్జాలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, నకిలీ డాక్యుమెంట్లు, స్థలాల ఆక్రమణ వంటివి నెల్లూరీయులు ఇంతకుముందు సినిమాలలో చూసేవాళ్లు, లేదంటే హైదరాబాద్ వంటి నగరంలో జరుగుతున్నట్లు పత్రికల్లో చదివేవాళ్లు. అలాంటిది, ఇప్పుడు నెల్లూరుజిల్లాలోనూ ఇవి పెద్దఎత్తున జరుగుతున్నాయి. దీనికంతటికీ కారణం స్థలాలు, పొలాల రేట్లు చుక్కలనంటుతుండడమే. 2004 ప్రాంతం నుండి జిల్లాలో రియల్ భూమ్ ఉండింది. భూముల రేట్లు కనీసం ఉన్నదానికి పదింతలు పెరిగాయి. దీంతో భూములు, ఫ్లాట్లు అమ్మకాలు, కొనుగోళ్లలో మోసాలు మొదలయ్యాయి. కొందరు రియల్టర్లు డబుల్ రిజిస్ట్రేషన్‌లకు పాల్పడ్డారు. ఒక ఫ్లాట్‌నే పలువురికి అమ్మారు. ఇలాంటి లే అవుట్‌లలో ఫ్లాట్లు కొన్నవాళ్ళు ఇప్పుడు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఇంకొందరు రెవెన్యూ శాఖలో సిబ్బందితో లాలూచి పడి నగరంలో విలువైన పోరంబోకు స్థలాలకు పట్టాలు సృష్టించారు. మరికొన్ని లే అవుట్లలో అయితే 60 అడుగుల క్రింద మాస్టర్ ప్లాన్‌లో వదిలేసిన రోడ్డును కూడా ఆక్రమించుకుని డాక్యుమెంట్లు సృష్టించారు. తక్కువ ధరకు వస్తున్నాయని చెప్పి ఇలాంటి స్థలాలు కొన్నోళ్లు నిలువునా మోసపోయారు. కొందరైతే నగరంలో విలువైన స్థలాలకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. ఒరిజినల్‌గా ఆ స్థలాలను కొన్నవారిని అమ్ముకోకుండా బ్లాక్‌మెయిల్ చేస్తూ వారి నుండి లక్షలాది రూపాయలు డిమాండ్ చేస్తున్నారు. నగరంలో నకిలీ సర్వే నెంబర్‌లతో డాక్యుమెంట్లు తయారుచేసి రైల్వే స్థలాన్ని సైతం కబ్జాచేసే ప్రయత్నాలు జరిగాయి.

ఇక మండల కేంద్రాలు, గ్రామాలలో కూడా భూములకు సంబంధించిన అనేక మోసాలు జరుగుతున్నాయి. రెవెన్యూ అధికారుల అండతో ప్రభుత్వ, పోరంబోకు, అసైన్డ్ భూములకు పట్టాలు సృష్టించి స్వాహా చేసే ప్రయత్నాలు తీవ్రంగానే జరుగుతున్నాయి.

# బంగారు జోష్ణవి

## ఏషియన్ యోగా పోటీలలో మూడు బంగారు పతకాలు



ఈ నెల 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు వియత్నాం దేశ రాజధాని హునాయ్‌లో జరిగిన 6వ ఏషియన్ యోగా పోటీలు అండర్-17 బాలికల విభాగంలో నెల్లూరు, మాగుంట లే అవుట్‌కు చెందిన ఏకాంబరం జోష్ణవి మూడు బంగారు పతకాలు, ఒక రజత పతకం సాధించి, నెల్లూరుకే కాక దేశానికే కీర్తి ప్రతిష్టలు తెచ్చింది. జోష్ణవి వ్యక్తిగత యోగా పోటీలలో బంగారు పతకం, ఆర్టిస్టిక్ యోగా, రిథమిక్ యోగా పోటీలలో బంగారు పతకం, వ్యక్తిగత సోలో ఆర్టిస్టిక్ పోటీలలో రజత పతకం సాధించింది. ఇక్కడ చూపిన అత్యద్భుత ప్రతిభతో ఈ ఏడాది డిసెంబర్‌లో దక్షిణ అమెరికాలో జరుగనున్న వరల్డ్ యోగా ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించింది. జోష్ణవి గతంలోనూ వివిధ దేశాలలో జరిగిన ఏషియా, వరల్డ్ యోగా పోటీలలో విశేష ప్రతిభతో బంగారు, రజత పతకాలు సాధించి వుండడం విశేషం. చిన్నారి జోష్ణవికి 'లాయర్' అభినందనలు.



# అడుగుపెట్టిన ఆనం

- ఆత్మకూరులో భారీ జనసందోహం



తెలుగుదేశంపార్టీ ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు తీసుకున్నాక ఆనం రామనారాయణరెడ్డి ఈ నెల 3వ తేదీన ఆత్మకూరులో తొలి అడుగుపెట్టాడు. ఇక్కడ నిర్వహించిన ఆత్మీయ సభను అదరగొట్టారు. ఈ సభకు భారీ ఎత్తున జన సమీకరణ చేసి ఆనం సోదరులు తమ సత్తా చాటారు. నియోజకవర్గంలోని ఆత్మకూరు, మర్రిపాడు, అనంతసాగరం, ఏ.ఎస్.పేట, చేజర్ల మండలాల నుండి ప్రజలు వాహనాలలో భారీగా తరలి వచ్చారు. మొన్నటిదాకా ఆత్మకూరు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించిన గూటూరు కన్నబాబు ఈ సమావేశంలో పెద్దన్న పాత్ర పోషించి అన్నీ తానై వ్యవహరించాడు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆనం రామనారాయణరెడ్డి ఆర్థిక మంత్రిగా వున్నప్పుడు ఆత్మకూరు నియోజకవర్గంలో అభివృద్ధికి నిధులు వరదలా పారించాడు. అయితే రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల్లో 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆనంకు తాను తెచ్చిన నిధుల స్థాయిలో కోటికి ఒక ఓటు లెక్కన కూడా రాలేదు. ఆరోజు ప్రజలు ఆనం మీద కోపం చూపలేదు గాని, కాంగ్రెస్‌ను అసహ్యించుకున్నారు. రామనారాయణరెడ్డి ఆ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోలేదు. కాబట్టి ఆయనకు ఓట్లు కూడా రాలేదు. కాని ఆత్మకూరుకు ఆనం చేసిన అభివృద్ధి పనులు అక్కడి ప్రజల మనసుల్లో ఉన్నాయి. కాబట్టి తెలుగుదేశం పట్ల వ్యతిరేకత వున్నా కూడా మర్రిపాడు, ఆత్మకూరు, అనంతసాగరం మండలాల రెడ్లు, ఇతర వర్గాల ప్రజలు ఆనం కోసం ఈ సభకు తరలి వచ్చారు. ఆనం స్థాయికి తగ్గట్లుగా నిర్వహించిన ఈ సభలో మంత్రి శిద్ధా రాఘవరావు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కంచర్ల శ్రీహరినాయుడు, వేనాటి రామచంద్రారెడ్డి, డాక్టర్ సి.హెచ్.ఆదిశేషయ్య, ఇందూరు వెంకటరమణారెడ్డి, పులిమి శైలజారెడ్డి, చల్లా రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## అవును... వాళ్లిద్దరూ సర్దుకున్నారు!



రాజకీయాల్లో ఎవరిమీదన్నా అలగడం అంటే తన కిందకు తాను నీళ్లు తెచ్చు కోవడమే! పరిస్థితులు ఎదురుతిరిగినప్పుడు తలవంచుకుపోతుండడమే రాజకీయోత్త ముల లక్షణం. ప్రస్తుతం ఆత్మకూరు రాజకీయాలలో కన్నబాబు కూడా దానినే అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆత్మకూరు నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జ్‌గా వున్న కన్నబాబును తొలగించి, ఆ బాధ్యతలను మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డికి అప్పగించడం ఆగస్టు నెలకు సంబంధించి జిల్లా రాజకీయాల్లో ఓ సంచలనం. ఇక్కడ పార్టీకి ఎవరు దిక్కు లేకుండా పోయినప్పుడు అన్నీ తానై దిక్కై నిలిచిన కన్నబాబును చంద్రబాబు చీపురు పుల్ల మాదిరిగా తీసి పక్కన పడేసాడు. కనీసం తనతో మాటమాత్రం చెప్పకుండా తన పదవి వూడబెరకడాన్ని కన్నబాబు జీర్ణించుకోలేకపోయాడు. అయితే ఇప్పటి పరిస్థితుల్లో చెరువు మీద అలిగినా చంద్రబాబు మీద అలిగినా పెద్ద తేడా లేదని 'లాయర్' రెండువారాల క్రితమే పేర్కొంది. కన్నబాబు కూడా చేసేదేమీ లేక అలకపాన్పు దిగాడు. పార్టీలో తన భవిష్యత్‌పై ఎటువంటి హామీ రాకపోయినా ఆత్మకూరులో ఆనం మొదటి సభకు మాత్రం ఆయనే నాయకత్వం వహించాడు. దీంతో ఆనంతో ఆయన సర్దుకుని ముందుకుపోవడం షురూ అయ్యింది.

## ఆత్మకూరు నుండి ఎవరు?

ఆత్మకూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్‌గా ఆనం రామనారాయణరెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటికి, వచ్చే ఎన్నికల్లో ఆయనే అభ్యర్థిగా ఉంటాడా అన్నది ప్రశ్నార్థకంగా వుంది. దీనికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. వచ్చే ఏడాది జనవరిలో జిల్లా స్థానిక శాసనమండలి నియోజకవర్గానికి ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఆనం రామనారాయణరెడ్డిని ఎమ్మెల్సీ చేసి మంత్రి వర్గంలోకి తీసుకుంటారన్న ప్రచారం వుంది. ఇదే జరిగితే 2019 ఎన్నికల్లో ఆత్మకూరు నుండి ఆయన పోటీ చేసే అవకాశం లేదు. అప్పుడు ఆత్మకూరు నుండి ఆనం వివేకా తనయుడు ఏ.సి.సుబ్బారెడ్డిని గాని లేదా ఆనం రామనారాయణరెడ్డి అల్లుడు, బద్వేల్ మాజీఎమ్మెల్యే విజయమ్మ కొడుకు రితేష్ కొండారెడ్డిని గాని రంగంలోకి దించవచ్చని తెలుస్తోంది. ఆత్మకూరు నుండి ఏ.సి.సుబ్బారెడ్డిని దించితే ఇక నెల్లూరు రెండు సీట్లను వేరేవాళ్లకిచ్చి, ఆనం వాళ్ల చేత ఇక్కడ కూడా పని చేయించుకోవాలన్నది ప్రణాళికగా వుంది.

అయితే ఆత్మకూరులో ఆనం రామనారాయణరెడ్డి కాకుండా ఇంకెవరు పోటీ చేసినా గట్టి పోటీ తప్పదు. ఆనం రామనారాయణరెడ్డి అభ్యర్థి అయితే వైకాపా వాళ్ళు గట్టి అభ్యర్థి కోసం వెదుక్కోవాల్సి వుంటుంది. వేరేవాళ్లయితే ఆ పార్టీ వాళ్లు అంత టెన్షన్ పడాల్సిన పనుండదు.

# మట్టి గణపతులకు పెరిగిన డిమాండ్

## పర్యావరణంపై ప్రజల్లో అవగాహన



సిఎంఆర్‌లో మట్టి గణపతులను అందజేస్తున్న కలెక్టర్ ముత్యాలరాజు



కాపువీధిలో మట్టి గణపయ్యలను పంపిణీ చేస్తున్న ఆనం వివేకా

ఈ ఏడాది వినాయకచవితి సందర్భంగా సంతోషించాల్సిన విషయం ప్రజల్లో మట్టి గణపతి విగ్రహాలను పెట్టి పూజలు చేయాలనే ఆసక్తి కలగడం. ఈమేరకు మట్టి గణపతి బొమ్మలకు డిమాండ్ పెరిగింది. రంగులు వేసిన బొమ్మల కంటే ప్రజలు మట్టి వినాయక ప్రతిమలను కొనడానికే ఆసక్తి చూపారు. అదీగాక సిఎంఆర్, శుభమస్తు షాపింగ్ మాల్స్‌తో పాటు పలు విద్యాసంస్థలు, స్వచ్ఛంధ సంస్థలు ప్రజలకు మట్టి గణపతి బొమ్మలను ఉచితంగా పంపిణీ చేశాయి. రంగుల బొమ్మలు వాడి నీళ్లను కలుషితం చెయ్యొద్దని మేధావులు, మీడియా చేసిన ప్రచారం చాలావరకు సత్ఫలితాలనే ఇచ్చాయనుకోవచ్చు.



ఏ.సి స్టేడియంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఏసి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



# 'రత్నం' చిన్నారుల రాక్‌షో

నెల్లూరు వేదాయపాలెం వెంకటరెడ్డినగర్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాలలో ఈ నెల 3వ తేదీన అనాధలకు ఆపన్నహస్తం కార్యక్రమం జరిగింది. విద్యార్థులు వ్యర్థ పదార్థాలతో వివిధ రకాల గృహోపకరణ వస్తువులు, కూరగాయలు, పండ్లు, ఆట వస్తువులను ప్రదర్శించి విక్రయించారు. ఎల్‌కెజి విద్యార్థులు ఫ్యాషన్‌షోను నిర్వహించారు. స్కూల్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు. నెల్లూరు సరస్వతినగర్‌లోని డాక్టర్ కిషోర్స్‌రత్నం స్కూల్లో చిన్నారులు ప్రదర్శించిన రాక్‌షో, తల్లిదండ్రుల సాయంతో తయారు చేసిన గ్రీటింగ్ కార్డుల విక్రయం ద్వారా డబ్బును సేకరించారు. వివిధ రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేసి మట్టి, పింగాణీతో తయారుచేసిన గృహోపకరణాలు, వస్తు సామాగ్రి, వివిధ రకాల పూలమొక్కలు, కథల పుస్తకాలు, బొమ్మలు, పండ్ల రసాలు విక్రయం ద్వారా వచ్చిన మొత్తాన్ని గొల్లపాళెం చైల్డ్ ఆశ్రమానికి అందించారు. రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, సీనియర్ మేనేజర్ రాజేష్, ప్రిన్సిపల్ ఝాన్సీ, లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

### కలెక్టర్ చొరవతో...

# కళాక్షేత్రానికి మహర్దశ



70వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ వెంకటేశ్వర కస్తూరిభా కళాక్షేత్రంలో జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. కళాక్షేత్రం దుస్థితి, ప్రేక్షకులు, కళాకారుల అవస్థలు ప్రత్యక్షంగా చూసిన ఆయన తక్షణం కళావేదికకు మరమ్మత్తులు చేయాలని అధికారులను ఆదేశించారు. కళాక్షేత్రం దుస్థితిపై కళాకారులు, ప్రేక్షకులు, జిల్లా ప్రజలు దశాబ్ద కాలంగా చేస్తున్న ఆందోళనలకు కలెక్టర్ ముత్యాలరాజు చొరవతో తెరపడింది. కళాక్షేత్రం మరమ్మత్తులకు దాదాపు కోటి రూపాయలకు పైగా ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. మూడు ప్యాకేజీల్లో పనులు ప్రారంభమయ్యాయి. రూ.10.50 లక్షలతో వాచ్‌మెన్ క్వార్టర్సు, రూ.58లక్షలతో సీలింగ్, ఎలక్ట్రికల్‌వర్క్స్‌తో పాటు నగిషీల పనులు చేపడుతారు. రూ.28లక్షలతో ఫ్లోరింగ్ స్టేజీ తదితర పనులు చేస్తారు. ఈ పనులు పూర్తయిన తర్వాత సెంట్రల్ ఏసి, సౌండ్‌సిస్టమ్‌తో కళాక్షేత్రాన్ని సౌకర్యవంతంగా కళావేదికను రూపొందించాలని సంబంధిత అధికార్లను కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం. కలెక్టర్ ఆలోచనలకు అనుగుణంగా కళాక్షేత్రాన్ని అయిదారు నెల్లో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు.

### కాకాణి, కోటంరెడ్డిలకు

## మున్సి'పోల్స్' బాధ్యతలు





త్వరలో రాష్ట్రంలోని కొన్ని మున్సిపాల్టీలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఆయా మున్సిపాల్టీలకు వైకాపా తరపున పరిశీలకులను నియమించారు. వైకాపా జిల్లా అధ్యక్షులు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ప్రకాశం జిల్లా కందుకూరు మున్సిపాల్టీ ఇన్‌ఛార్జ్‌గా, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఒంగోలు కార్పొరేషన్ ఇన్‌ఛార్జ్‌గా నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశాడు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు



పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలతో వినాయకచవితి ఉత్సవాలను జరుపుకోవాలని కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. 3వ తేదీ నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని కురుగుంట్ల నాగిరెడ్డి(కెఎన్ఆర్) ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మలకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి అనారోగ్యాలను కొని తెచ్చుకుంటున్నారన్నారు. ఈ పాఠశాలకు కంప్యూటర్లు, ఇతర సౌకర్యాల కోసం స్వర్ణభారత్ ట్రస్ట్ తరపున రూ.లక్ష విరాళంగా అందజేస్తామని వెంకయ్యనాయుడు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్, కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

# వ్యాస్ స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం



నెల్లూరు మూలాపేటలోని కెఎన్‌వ్యాస్ పోలీస్ వెల్ఫేర్ స్కూల్లో ఈ నెల 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధా కృష్ణన్‌కు నివాళులర్పించారు. అనంతరం స్కూలు పిల్లలు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. విద్యార్థుల ఉపన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏఆర్ డిఎస్‌పి చెంచురెడ్డి మాట్లాడుతూ అన్ని రంగాల్లో అత్యున్నతమైన వ్యక్తుల్ని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు.

ఈ కార్యక్రమంలో స్కూలు విద్యార్థులు ఏఆర్ డిఎస్పీ సతీమణి, హిమాలయ స్కూలు కరస్పాండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

# 18న రెవెన్యూ సంఘం ఎన్నికలు

ఏపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నెల్లూరు డివిజన్ ఎన్నికలు ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి కాయల సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో ఈ ఎన్నికల ప్రక్రియ జరుగుతుందని, 8వ తేదీ వరకు ఉద్యోగుల సభ్యత్వ నమోదు చేపట్టనున్నామని, 9 న ఎన్నికల ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు స్వీకరిస్తామని, 10వ తేదీ నామినేషన్ల స్వీకరణ, అనంతరం 18వ తేదీన ఎన్నికలు నిర్వహించి గెలుపొందిన అభ్యర్థులను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

### రిచ్ లిటిల్ టీత్‌లో

# ఉచిత వైద్య శిబిరం



నెల్లూరు పొగతోటలోని రిచ్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలోని లిటిల్ టీత్‌లో ఆదివారం ఉచిత దంత వైద్యశిబిరం జరిగింది. ఈ శిబిరంలో చిన్న పిల్లల ఎత్తుపళ్లు, వంకరపళ్లు, పళ్ల మధ్యలో సందులు, ఎగుడుదిగుడు పళ్లు ఉన్న వారికి ఉచిత వైద్యసేవలు అందించారు. దంత సమస్యలపై అవగాహన కలిగించారు. ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ మలినేని, డాక్టర్ సుధీర్‌బాబు పాల్గొని చిన్నారులకు ఉచిత వైద్యంతో పాటు మందులు అందజేశారు. ఈ సందర్భంగా రిచ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ టి.రవికుమార్ మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరం సెప్టెంబర్ నెలలోని ప్రతి ఆదివారం ఉదయం 9గంటల నుండి నిర్వహిస్తామన్నారు. ఆటలు ఆడుకునే పిల్లలకు పళ్లు విరగడం జరుగుతుంటుందని, అలాంటి పిల్లకు చికిత్సతో పాటు మౌత్‌గార్డులను పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ప్రభుత్వ ప్రైవేట్ డాక్టర్లపై

## కఠిన చర్యలు

ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లుగా పని చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన పేషంట్లను తమ ప్రైవేట్ క్లినిక్‌లకు రప్పించుకుని వైద్యం చేస్తే వారిపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా అటువంటి డాక్టర్లను గుర్తిస్తే ఆ వివరాలను ప్రజలు గాని, స్వచ్ఛంధ సేవా సంస్థలు గాని టోల్‌ఫ్రీ నెంబర్ 1800 4252499కు ఫోన్ చేయాలని తెలియజేశారు.

# ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5వ తేదీన నెల్లూరు పొదలకూరురోడ్డులోని జడ్పీ బాలికల పాఠశాల, ఆవరణంలో పదిమంది ఉపాధ్యాయులను జడ్పీ వాకర్స్ సంఘం తరపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చలంచర్ల భాస్కరరెడ్డి, గౌరవసలహాదారు బిరుదవోలు రామిరెడ్డి, ఇంటర్నేషనల్ వైస్‌ఛైర్మన్ మండవ శ్రీనివాసరావు, టి.వి.రమణయ్య, సుధాకరరెడ్డి, శ్రీధర్, ఎం.వి.నారాయణరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు బి.రామిరెడ్డి, టి.వి.రమణయ్య, ఎం.వి.నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, మహాలక్ష్మమ్మ, ఎం.వెంకటకృష్ణయ్య, కృష్ణారావు, పి.బాలసుబ్రహ్మణ్యం, అల్లూరు రాజు, జి.పెంచలయ్యలను సంఘం తరపున సత్కరించారు.



# శివాజీ సెంటర్లో...
# విపిఆర్ ప్రత్యేకపూజలు

నెల్లూరు ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ వద్దనున్న శివాజీ సెంటర్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక వరసిద్ది ప్రసన్న వినాయకుని విగ్రహాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త, సంఘసేవకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ నెల 5వ తేదీన ప్రారంభించి ప్రత్యేకపూజలు నిర్వహించి నెల్లూరుజిల్లా ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీసెంటర్‌కు తాను అనేక సంవత్సరాలుగా వస్తున్నానని, ప్రతిసారి ఒక వినూత్నమైన అలంకరణతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్న శివాజీసెంటర్ మిత్రమండలి కార్యనిర్వాహకులు బండారు విజయ్‌కుమార్‌రెడ్డి, కె.వి.సుబ్రహ్మణ్యంలను అభినందించారు. సాయంత్రం నెల్లూరు నగర డిఎస్పీ జె.వి.రాముడు, శబరి శ్రీరామక్షేత్రం ఛైర్మెన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి పాల్గొని పూజాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, రాష్ట్ర నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

# గర్భగుడిలోకి దళితులను తీసుకెళ్లండి

మంచికో చెడుకో అప్పుడప్పుడు రాజకీయ నాయకుల నోటి నుండి వచ్చే మాటలు ఆచరణ రూపం దాలిస్తే ఎంతో బాగుండనిపిస్తుంది. ఈ నెల 3వ తేదీన నెల్లూరు నగరం 2, 12డివిజన్‌ల పరిధిలోని చంద్రమౌళేశ్వరస్వామి, వీరాంజనేయ స్వామి ఆలయాల కొత్త పాలకవర్గాల అభినందన సభ జరిగింది. ఈ సభలో ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తెలుగుదేశం నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెమట కారుస్తున్నారనే గ్యాస్ మాటలతో పాటు ఇంకో మంచి మాట చెప్పారు. దేవాలయాల గర్భగుడులలోకి విఐపిలను, వివిఐపిలను తీసుకెళ్లడం తగ్గించి, అక్కడికి పేదలను, దళితులను తీసుకెళ్లండంటూ పాలకవర్గాలకు, పూజారులకు సూచించారు. నిజంగా ఈ కాలంలో ఆచరించదగ్గ మాట ఇది! మన దేవాలయాలలో వుండే అతిపెద్ద దురాచారం విఐపి విధానం. ఆలయాలలో పూజలు, పునస్కారాలు, దర్శనాలు పేదోడికి ఒక రకంగానూ, పెద్దోడికి ఇంకో రకంగానూ ఉంటాయి. అంతెందుకు కలియుగ దేవుడు శ్రీనివాసుడు కొలువైన తిరుమల దేవస్థానంలోనే విఐపి విష సంస్కృతి ఏ స్థాయిలో వుందో చూస్తున్నాం. 500 రూపాయల టిక్కెట్‌తో విఐపిలు శ్రీవారిని మొదటి ద్వారం నుండే దర్శించుకుంటే, స్వామిపై భక్తితో ఎంతో ప్రయాసకోర్చి, నడుచుకుంటూ ఏడుకొండలెక్కి, గంటల తరబడి సర్వదర్శనం క్యూలో వుండి గోవింద నామస్మరణ చేస్తూ గర్భగుడిలోకి వచ్చిన సాధారణ భక్తుడికి మాత్రం శ్రీవారు ఏడవ ద్వారం నుండి దర్శనమిస్తాడు. ఈ వివక్షను పాటించమని స్వామి చెప్పాడా? పెద్దోళ్లకు దగ్గరగా, పేదలకు దూరంగా దర్శనమివ్వాలని ఆయనేమన్నా స్వీయనియంత్రణ విధించుకున్నాడా? భక్తులు ఎవరు ఎక్కడ నుండి తనను చూసినా, ఆయన చూసే దూరం ఒకటిగానే వుంటుంది. తన హుండీలో రూపాయి కానుక వేసిన భక్తుడిని ఓ రకంగానూ, కోటి రూపాయలు వేసిన భక్తుడిని ప్రేమగానూ చూస్తే ఆయన దేవుడెందుకవుతాడు... రాజకీయ నాయకుడవుతాడు.

దేవాలయాలలో పేద, పెద్ద తేడా పోవాలి. కులమతాలు పోవాలి. విఐపి సంస్కృతి పోవాలి. దేవుడు కొందరివాడు కాదు, అందరివాడు. ఆ కులం ఈ కులం అని లేకుండా అందరికీ దేవాలయాలలో ఒకే తరహా దర్శన విధానం, పూజాపద్దతి అవలంభిస్తే మన సంస్కృతికి దూరమవుతున్న వివిధ వర్గాల ప్రజలు మళ్ళీ మనకు దగ్గరకావచ్చు.




### మూడు వారాలు నిర్వహించాల్సిన సమావేశాలు
# మూడురోజులేనా?
## - అసెంబ్లీ సమావేశాలపై కోటంరెడ్డి ధ్వజం



అసెంబ్లీ సమావేశాలను బాగా కుదించేస్తుండడం విచారకరమని, మూడు వారాల పాటు నిర్వహించాల్సిన అసెంబ్లీ సమావేశాలు ఈసారి కేవలం మూడు రోజులపాటే నిర్వహించాలనుకోవడం ఏమిటని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విస్మయం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన నెల్లూరులోని వైఎస్సార్సీపి రూరల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అసెంబ్లీ సమావేశాల్లో తన నియోజకవర్గంలోని సమస్యలను ప్రస్తావించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. క్రైస్తవ స్మశానవాటికకు స్థలం కేటాయించాలని, కొత్తూరులో జర్నలిస్టుల కాలనీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతానని తెలిపారు. జాతీయరహదారిపై బుజబుజ నెల్లూరు, కనుపర్తిపాడు క్రాస్‌రోడ్డు, చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డు, ఎన్టీఆర్ నగర్ జంక్షన్‌ల వద్ద ప్రయాణీకులు, ప్రజల సౌకర్యార్థం అండర్ బ్రిడ్జిలను ఏర్పాటుచేయాలని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని చెప్పారు. వైఎస్సార్ నగర్‌లో వసతుల కల్పనకు, ప్రత్యేక షాదీ మంజిల్ ఏర్పాటుకు, అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలు ఇప్పించేందుకు, నెల్లూరు నగరపాలకసంస్థకు హడ్కో అప్పుల భారం లేకుండా కార్పొరేషన్ సమస్యలను, కోవూరు షుగర్‌ఫ్యాక్టరీ సమస్యను కూడా ప్రస్తావిస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాలను కుదించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్న నేపథ్యంలో, సమయాన్నిబట్టి వీలైనంతవరకు ఈ సమస్యలను ప్రస్తావించి ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్సీపి నగర శాఖ అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, కార్పొరేషన్ విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్, కార్పొరేటర్ లేబూరు పరమేశ్వరరెడ్డి, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, సలీమ్, డాక్టర్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల గుండెల్లో...
# చిరస్థాయిగా నిలిచిన వైయస్సార్
## ● వాడవాడలా 7వ వర్ధంతి

మాజీముఖ్యమంత్రి స్వర్గీయ వై.యస్. రాజశేఖరరెడ్డి కాంగ్రెస్‌పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి ముఖ్యమంత్రి స్థాయికి చేరుకుని 2004 నుంచి 2009 వరకు సమర్థవంతంగా పరిపాలించి ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలకు ముఖ్యకారకుడై ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని నెల్లూరుజిల్లా ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు పనబాక కృష్ణయ్య అన్నారు. వైయస్ఆర్ 7వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 2వతేదీ నెల్లూరు దర్గామిట్ట కరెంటాఫీసు సెంటర్ వద్ద వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, పిసిసి సమన్వయకమిటి సభ్యులు సి.వి.శేషారెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి చెంచలబాబుయాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు, అనుబంధ సంస్థల అధ్యక్షులు పాల్గొని నివాళులర్పించారు.


నెల్లూరు నగరం ట్రంకురోడ్డులో డా॥ వైయస్సార్ విగ్రహానికి నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో వైయస్సార్ పరిపాలన ఒక స్వర్ణ అధ్యాయమన్నారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ పేదలు, రైతులు దైవంగా భావించే వైయస్సార్ మరణించి ఏడేళ్లయినా ఇంతవరకు ఇక్కడ ప్రజలు మరచిపోలేదన్నారు. కార్పొరేటర్లు వర్ధంతిలో పాల్గొన్నారు.

నెల్లూరు నగర నియోజకవర్గంలో డా॥



వైయస్సార్ 7వ వర్ధంతి సందర్భంగా వెంకటేశ్వరపురంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని కూడా నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌యాదవ్ ప్రారంభించారు.

నెల్లూరులోని 21వ డివిజన్ పరిధిలో వైయస్ వర్ధంతి సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమాలను నెల్లూరు రూరల్



ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రారంభించారు. 52వ డివిజన్ రంగనాయకుల పేటలో వైయస్సార్సీపీ మైనార్టీ విభాగం నగర అధ్యక్షులు పఠాన్ ఫయాజ్‌ఖాన్ ఆధ్వర్యంలో వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మూసాభాయ్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీనగర్ గీతామయి వృద్ధుల ఆశ్రమంలో 13వ డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు మాధవయ్య ఆధ్వర్యంలో వైయస్సార్ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొండారెడ్డి, ఎస్‌కె మాబు, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, ముడియాల దశరథరామిరెడ్డి, ఓడూరు మహీధర్‌రెడ్డి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.





## మోకాలి అరుగుదలకు..

# స్టెమ్‌సెల్‌తో సమాధానం

**- అపోలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి**



నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో మోకాలి అరుగుదలకు అత్యాధునిక స్టెమ్‌సెల్ శస్త్రచికిత్సతో నయం చేస్తున్నామని ఆసుపత్రి ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దవారిలో స్టెమ్ సెల్స్ వాటి పాటికవే ఉత్పత్తి అవుతాయన్నారు. అయితే కొన్ని సందర్భాల్లో ఇవి పని చేయవని, అలాంటి తరుణంలో రక్తంలో కణాలను పునరుత్పత్తి చేసుకుని శరీరం సాధారణ స్థితికి చేరుకునేందుకు వీలుగా ప్లేట్‌లెట్, రిచ్ ప్లాస్మా, ప్లేట్‌లెట్ లైసేట్ ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా సంపూర్ణ చికిత్సను అందిస్తామన్నారు. కీళ్ల మధ్య ఒరిపిడి లేకుండా, లిగ్‌మెంట్, కండర గాయాలు త్వరగా నయమయ్యేందుకు, ముఖ్యంగా ప్రొఫెషనల్ క్రీడాకారులు త్వరగా కోలుకునేందుకు ఈ చికిత్సా విధానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

ఈ చికిత్స విధానంలో ఆసుపత్రిలో చేరాల్సిన అవసరం లేదని, రక్తం పోదని, నొప్పికి సైడ్‌ఎఫెక్ట్‌లకు, ఇన్‌ఫెక్షన్‌కు అవకాశం లేదని చెప్పారు. అతి తక్కువ ఖర్చుతో ఈ చికిత్సను పూర్తి చేయొచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ వివేకానందరెడ్డి, డాక్టర్ మీరావలి, డాక్టర్ విజయకిషోర్, డాక్టర్ పి.నరేంద్ర, ఆసుపత్రి యూనిట్ హెడ్ నవీన్ పాల్గొన్నారు.

# ఎల్ఐసి సామాజిక సేవలు





నెల్లూరు దర్గామిట్టలోని ఎల్ఐసి డివిజనల్ కార్యాలయంలో ఈ నెల 4వ తేదీ 60వ బీమా వారోత్సవాలను పురస్కరించుకుని పాలసీదారుల సమావేశం సిఆర్ఎం విభాగం ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి నెల్లూరు డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ పి.రమేష్‌బాబు, మార్కెటింగ్ మేనేజర్ కె.మునికృష్ణయ్య పాల్గొని ప్రీమియంను సులువుగా ఏ విధంగా చెల్లించాలి, ఎల్ఐసి దేశ ప్రజలకు సామాజిక సేవలు ఏ విధంగా అందిస్తోంది, పాలసీదారుల సమస్యల పరిష్కారం తదితర విషయాలు గురించి సమాచారం అందించారు. దాదాపు 70 మందికి పైగా పాల్గొన్న ఈ సమావేశంలో ఎల్ఐసి బ్రాంచి-1, బ్రాంచి-2 సిఎబి మార్కెటింగ్, సిఆర్ఎం విభాగాల అధికారులు, సేల్స్‌మేనేజర్, సిఆర్ఎం అధికారి రవికుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

ఎల్ఐసి 60సంవత్సరాల సంబరాల్లో భాగంగా నెల్లూరు విఆర్‌సి మైదానంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరం సింహపురి హాస్పిటల్ డాక్టర్లు అశోక్, రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, సింహపురి ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నారు.

# ఆదర్శప్రాయుడు సర్వేపల్లి

- వేదవ్యాసలో టీచర్స్ డే



నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని వేదవ్యాస స్కూల్లో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవంలో వేదవ్యాస స్కూలు విద్యార్థులు, తల్లిదండ్రులు, స్కూలు మేనేజ్‌మెంట్ కలిసి ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా వందలాది స్కూలు, కాలేజీలలో రక్తదానంపై అవగాహన తరగతులు నిర్వహించి, 18 సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థి రక్తదానం చేసే విధంగా విద్యార్థులను మోటివేషన్ చేసిన ప్రముఖ రక్తదాన మోటివేటర్ సుబ్బారావును ప్రత్యేకంగా సన్మానించి, ఆయన చేసిన కృషికి అభినందనలు తెలిపారు.

## నేతాజీలో..

# ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



నెల్లూరులోని శ్రీ నేతాజీ పైలెట్ హైస్కూలులో ఈ నెల 3వ తేదీ మాజీ రాష్ట్రపతి స్వర్గీయ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ నెల 5వ తేదీ వినాయకచవితి సెలవురోజైనందున ముందుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించినట్లు సంస్థ కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపల్ ఎం.వి.సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరునితో సమానమని, తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుదేనని, గురువు యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా తమ సంస్థలో 20సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు జి.రమణారెడ్డి, ఎ.పద్మజలను, పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు జి.శాంతి, ఆర్.సి.వరలక్ష్మి, జి.వి.గిరిజ, కె.దేవసేన, వి.లక్ష్మిలను సత్కరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ఎం.వి.సుబ్బారెడ్డిని సత్కరించారు.

ఈ కార్యక్రమంలో నేతాజీ ఎడ్యుకేషనల్ సొసైటి అధ్యక్షులు వేదవతి సుబ్బారెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ వాణి, హెడ్‌మిస్ట్రస్ ఎన్.ప్రసన్న, హెడ్‌మాస్టర్ ఎస్‌వివిఎల్ నరశింహారావు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# గురువులే... విజ్ఞాన సిరులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ప్రక్కన విద్యాసంస్థల ప్రతినిధులు

గూడూరు పట్టణంలో ఈ నెల 3వ తేదీ గూడూరు ప్రాంత ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం ఆధ్వర్యంలో డిఎన్ఆర్ కమ్యూనిటి హాలులో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. తొలుత పట్టణంలోని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో గురువుకు ఉన్న స్థానం, గౌరవమర్యాదలు ఎవరికీ అందవని అన్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే యువతను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని చెప్పారు. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన మహానుభావుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం అన్నారు. సమాజంలో ఆదర్శప్రాయుడని ఉపాధ్యాయవృత్తి నుంచి రాష్ట్రపతిగా ఎదిగారని చెప్పారు. క్రీడల్లో పాల్గొని గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ మంజులాక్షి, విద్యాసంస్థల ప్రతినిధులు సుబ్బారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బాలకృష్ణంరాజు, జి.వి.పవన్‌కుమార్, కిషోర్, చంద్రమోహన్, దశరథరామిరెడ్డి, కమలాకర్, శ్రీదేవి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో

# గురుపూజోత్సవం



ఉపాధ్యాయులను, జర్నలిస్టులను సన్మానిస్తున్న గూడూరు బ్రాహ్మణ సంఘం నాయకులు

గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 129వ జయంతి సందర్భంగా హనుమంతరావు నగర్‌లో సోమవారం సాయంత్రం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు యరగుడిపాటి చలపతిరావు మాట్లాడుతూ భారతరత్న బిరుదుకు న్యాయం చేకూర్చారని, పేద కుటుంబంలో పుట్టి వీధిదీపాల కింద చదివి అత్యున్నత రాష్ట్రపతి స్థాయికి, అనేక అత్యున్నత పదవులను స్వీకరించిన డాక్టర్ రాధాకృష్ణన్ బ్రాహ్మణుడు కావడం గర్వకారణమని సగర్వంగా తెలిపారు. పై కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు శ్రీకంఠి నాగరాజారావు, ముఖ్యఅతిథి శ్రీకంఠి రామ్మోహన్‌రావు రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వై.లలితమ్మ, పి.రాధాకుమారి, ఎస్.నాగేంద్రప్రసాద్, సీనియర్ జర్నలిస్టు, 'లాయర్' వారపత్రిక గూడూరు ఇన్‌ఛార్జి, సంఘ ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్, జి.కె.నాదబ్రహ్మంలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, సభ్యులు డి.బి.శ్రీనివాస్, ఎస్.శ్రావణ్‌కుమార్, కడివేటి రామమూర్తి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్యం



యోగా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్ తదితరులు

క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా ఆరోగ్యం మన సొంతం అవుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు రెండో పట్టణంలోని జి.ఎస్.రాయులు ఉన్నత పాఠశాల పిఇటి వెంకటసుబ్బయ్య ఏర్పాటు చేసిన యోగా పోస్టర్‌ను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బయ్యను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, వైస్ ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, కౌన్సిలర్లు వి.శివకుమార్, ఇజ్రాయిల్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# 10న జాతీయ లోక్‌అదాలత్

ఈనెల 10వతేదీన జరిగే లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని ఏడో అదనపు జిల్లా జడ్జి గుర్రప్ప అన్నారు. గూడూరు కోర్టులో పోలీసులు, అధికారులతో ఇటీవల లోక్‌అదాలత్ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు పరిధిలో 450 వరకు కేసులు ఉన్నాయని, ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్‌కు ఇండియన్ పోలీస్‌మెడల్ రావడంపై జడ్జీలు అభినందనలు తెలిపారు.

బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు



# రాశి - మీ వాసి

తేది. 9.9.2016 నుండి
తేది. 15.9.2016 వరకు

ఈ వారం సింహంలో రవి బుధ రాహువులు, కన్యలో గురు శుక్రులు, వృశ్చికంలో శనికుజులు, కుంభంలో కేతువు, వృశ్చిక ధనుర్మకర కుంభరాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 11 ఆదివారం గురుమౌఢ్యమి ప్రారంభము.
తేది 15 గురువారము శ్రీ అనంత పద్మనాభ వ్రతము.
ముహూర్తములు లేవు.

**భాద్రపద మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 9 | శుక్ర | అష్టమి | రా॥ గం.2.11ని॥ |
| తేది. 10 | శని | నవమి | రా॥ గం.3.30ని॥ |
| తేది. 11 | ఆది | దశమి | రా॥ గం.4.17ని॥ |
| తేది. 12 | సోమ | ఏకాదశి | రా॥ గం.4.38ని॥ |
| తేది. 13 | మంగళ | ద్వాదశి | రా॥ గం.4.22ని॥ |
| తేది. 14 | బుధ | త్రయోదశి | రా॥ గం.3.42ని॥ |
| తేది. 15 | గురు | చతుర్దశి | రా॥ గం.2.30ని॥ |

## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా ఉండవు. ఖర్చులు పెరుగుతాయి. గృహ వస్తువాహన రిపేర్లుండ గలవు. అనుకున్న పనులకు ఆటంకాలు రావడం వల్ల ఇబ్బందులు పడతారు. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడు కొనాలి. ఉద్యోగులు సహచరులతో అధికారులతో జాగ్రత్తగా మెలగండి. అనుకున్న సహాయాన్ని పొంద లేకపోవచ్చును. విద్యార్థులు బాగా కష్టపడాలి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తి పరంగా జీవనం కలవారికి ఆర్థిక స్థితి కొంత బాగుంటుంది. వ్యాపారవర్గాలకు మంచి అభివృద్ధి అవకాశాలు, ఆదాయం బాగుంటుంది. అనుకున్న పనులు కొద్ది ఆటంకాలతో సాగుతాయి. ప్రభుత్వం నుండి అనుమతులు బ్యాంకు ఋణాలు లభ్యంకాగలవు. గృహ నిర్మాణదారులకు, కాంట్రాక్టర్లకు బాగుంటుంది. భూ లావాదేవీలు ఫలించగలవు.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కొత్త పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు లభించగలవు. అవసరాలకు మాట రూపేణ, డబ్బు రూపేణ సహాయం చేస్తారు. యజమానులకు వర్కర్లతో సమస్యలు రావచ్చును. ఆరోగ్యం జాగ్రత్త. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. అనుకోని ప్రయాణాలు, శుభకార్య ప్రయత్నాలలో ఆలస్యం ఉంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్థికంగా బాగుండి, వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగ్గ ఫలితం ఉంటుంది. ఈ రాశివారికి కార్య సమర్థత, గౌరవ ప్రతిష్టలు బాగుంటాయి. దూరప్రయాణాలు ఖరారు కాగలవు. అనుకున్న పనులు నిదానంగా జరుగు తాయి. వ్యవహారాలందు, ఆర్థిక ఒప్పందాలందు దృష్టి పెట్టి నిర్వహిస్తారు. ఉద్యోగులకు రావలసిన బాకీలు లభించడం, పని భారం ఉంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆదాయం పెరిగి వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. అయితే ఖర్చులు కూడా పెరుగుతాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. పనులు ముందు వెనుకలుగా జరుగుతూ టెన్షన్ పెడతాయి. ఉద్యోగులకు విధి నిర్వహణ సామర్థ్యం, అధికారులతో మైత్రి బాగుంటుంది. ఆకస్మిక ప్రయాణా లుంటాయి. విద్యావృద్ధి కలదు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

చిన్నవ్యాపారులు, వృత్తి జీవనం కలవారికి ఆర్థి కంగా బాగుంటుంది. హోల్‌సేల్ వ్యాపారులకు, కాంట్రా క్టర్లకు ప్రభుత్వ పరంగా ఇబ్బందులుంటాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. బంధువులతో భేదాభి ప్రాయాలుంటాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత తక్కువ. పట్టుదలతో అనుకున్న పనులు సాధించుకొం టారు. అనుకోని పెద్ద ఖర్చు పైనబడగలదు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కొన్ని ముఖ్య పనులు వాయిదా వేసికొంటారు. వృత్తి వ్యాపారాలతో సామాన్య అవకాశాలు ఆదాయం ఉం టుంది. కుటుంబ ఖర్చులు కొన్ని అదనంగా పెట్టక తప్పదు. చేపట్టిన పనులు సరిగా సాగక చికాకు కలిగి స్తాయి. కొత్త పరిచయాలు ఉన్నతికి తోడ్పడతాయి. ఇతరులపై ఆధారపడకుండా నిర్ణయాలు తీసికొనండి. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి అనుకూల సమయం.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

సమస్యాత్మక విషయాలలో సంప్రదింపులు, చర్చలు జరిగి పరిష్కారము కాగలవు. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు రావడం, ఆదాయం పెరగడం ఉంటుంది. నోటీసులు, ముఖ్యపత్రాలు అందుకుంటారు. ఉద్యోగ సౌఖ్యము, కొత్త ఉద్యోగావకాశాలు దొరకడం జరుగ వచ్చును. పరుష ప్రవర్తన, తొందరపాటు మాటలు తగ్గించుకొనాలి. విద్యా ప్రగతి బాగుంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వ్యాపారాలలో ఒడిదుడుకులు అధిగమించి, రాబడి పెరుగుతుంది. వృత్తి జీవనంలో సామాన్య అవకాశాలుం టాయి. అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. ఆర్థిక వ్యవహారాలు జాగ్రత్తగా నిర్వహించాలి. బిడ్డలకు అభివృద్ధి బాగుంది. ఉద్యోగులకు స్థాన మార్పులు, పని భారం బాగుంటుంది. కొంతమంది మిమ్మల్ని పరోక్షంగా కించపరచవచ్చును. విద్యా ప్రగతి బాగుంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. ఆశించినంత ఎక్కువ ఆదాయముండదు. ప్రభుత్వ అనుమతులు రావడం, బ్యాంకు ఋణాలు లభించడంలో కాలయాపన జరగవచ్చును. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. వ్యాపారాభివృద్ధికి కొత్త ప్రయత్నాలు జరుపు తారు. సమస్యలు క్రమంగా సర్దుబాటు కాగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కుటుంబంలో చిన్నచిన్న సమస్యలుండి సర్దుబాటు కాగలవు. గృహవస్తు వాహన రిపేర్లు ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి వేగం పుంజు కుంటాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. ఓర్పు నేర్పులతో పనులు చక్కబెట్టుకొనవలసి ఉండును. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరుకుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఆర్థికంగా బాగుంటుంది. దైవకార్యక్రమాలలో పాల్గొంటారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

పైకి తీవ్రత లేకపోయినా ఆర్థికంగా ఇబ్బందులుం టాయి. వ్యాపార వర్గాలకు అవకాశాలు సరిగా ఉండవు. వృత్తి జీవనం కలవారికి రాబడి షుమారుగా ఉంటుంది. బంధువర్గంతో కొద్దిపాటి అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు లభిస్తాయి. అనుకున్న పనులను జాగ్రత్తగా నెరవేర్చుకొంటారు. విద్యా ప్రగతి బాగుంటుంది. ప్రయాణాలుంటాయి.

# చంద్రుడి చతుర్ముఖావతారం

శ్రీను గల్పిక

తమ్ముళ్లూ... మీరు చెప్పండి... సత్య నాదెళ్లను మైక్రోసాఫ్ట్ సిఇఓను చేసింది నేను కాదా... బిల్‌గేట్స్‌కు సాఫ్ట్‌వేర్ వ్యాపారం చేసుకుంటే బాగుపడతావని సలహా ఇచ్చింది నేను కాదా... సుందర్ పిచాయ్‌ను గూగల్ సిఇఓను చేసింది నేను కాదా... మీ చేతుల్లో ఉండే సెల్‌ఫోన్‌లను ఈ రాష్ట్రానికి తెచ్చింది నేను కాదా? చెప్పండి తమ్ముళ్లు... న్యాయం మీరే చెప్పండంటూ అనంతపురం జిల్లాలోని ఓ సభలో హైటెక్‌రత్న, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్వేగంగా ప్రసం గిస్తున్నాడు. అవును... అవును... కంప్యూ టర్లను తెచ్చింది మీరే... మా కడుపులు మండేలా చేసింది మీరే.... అంటూ సభలో నుండి హర్షధ్వానాలు మొదల య్యాయి. అప్పుడే వేదిక మీదకు మంత్రి పల్లె రఘునాథరెడ్డి వచ్చాడు. చంద్రబాబు చెవి దగ్గర తన నోరుపెట్టి... సార్, ఓటు -నోటు కేసులో మిమ్మల్ని విచారించమని ఏసిబిని ప్రత్యేక కోర్టు ఆదేశించిందట... అని చెప్పాడు. అయితే సంతోషానికైనా, విషాదానికైనా చంద్రబాబు ఫేసులో పెద్దమార్పు కనిపించదు. కాని మనిషి మాత్రం కొంత ఆందోళనకు లోనైనట్లు కనిపించింది. వెంటనే మీటింగ్ ముగించి విజయవాడకు బయల్దేరాడు.

★★★★★

విజయవాడలోని తన ఛాంబర్‌లో ఆయన హోంమంత్రి నిమ్మకాయల చిన రాజప్ప, మంత్రులు పత్తిపాటి పుల్లారావు, దేవినేని ఉమ, పి.నారాయణ, ఇంటలి జన్స్ ఐజి పి.వి.సునీల్‌కుమార్‌తో సమా వేశమయ్యాడు. ఆయన ఆవేశంగా... ఈ రాష్ట్రంలో పోలీసులకు ఏ పనీ లేదు. ఫ్యాక్షనిజం లేదు, మావోయిజం లేదు... మీకు రెండే రెండు డ్యూటీలు... ఒకటి పుష్కరాలు, రెండోది నా బందోబస్తు... ఆస్ట్రాల్ ఒక ఎమ్మెల్యే నా మీద కోర్టులో పిటిషన్ వేస్తుంటే మీరు ఏం పీకుతున్నట్లు.. వాళ్లు పిటిషన్ వల్ల నాకేదో అవుతుందని కాదు.. కాని సింగపూర్ రాజధానికి ఇవన్నీ న్యూసెన్స్. ఆ జగన్ ఇంతవరకు నన్ను ఒక వైపే చూసాడు... మా బాలయ్యలాగా రెండో వైపు కూడా కాదు... నేను ఎన్ని వైపుల్లో వుంటానో రేపు చూపిస్తాను... పిల్లకాకి కేం తెలుసు ఉండేలు దెబ్బ... నా దెబ్బకు ఆ జగన్‌కు దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అవ్వాలి... ఇంకెప్పుడూ నాపై కేసులు జోలికే పోకు డదు అంటూ ఆవేశంగా లేచాడు.

★★★★★

అది హైదరాబాద్‌లోని హైకోర్టు ప్రాంగణం. తన మీద ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఆదేశాలను నిలుపుదల చేయాలని కోరుతూ చంద్రబాబు పిటిషన్ దాఖలు చేయబోతున్నాడని తెలిసి ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, వైకాపా ఎంపీలు వై.వి.సుబ్బారెడ్డి, వేణుంబాక విజయసాయిరెడ్డి, మేకపాటి రాజమోహన్ రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఆర్.కె.రోజా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మేకపాటి గౌతంరెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు హైకోర్టుకు చేరుకున్నారు. వీరంతా గ్యాలరీలో కూర్చుని వుండగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చౌదరి తన సీటులో కూర్చున్నారు. ఆయన తలపై జస్టిస్ విగ్గు పెట్టుకుని ఉండడంతో ఎవరూ ఆయనను గుర్తుపట్టలేదు. ఓవైపు బోనులో ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న చంద్రబాబు నిలబడ్డాడు. ప్రతివాది తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి లేచి... యువరానర్, ఓటు-నోటు కేసులో చంద్రబాబు గారి పాత్ర ఉన్నట్లు ఆధారాలతో సహా ఋజువైంది, దీనికి సంబంధించి ముంబై ఫోరెన్సిక్ ల్యాబ్ ఇచ్చిన నివేదికలు కూడా మీకు అందిం చాము... ఈ సమయంలో అతనిపై విచారణ జరుపకుండా స్టే ఇస్తే కేసులో సాక్ష్యాలు తారుమారయ్యే అవకాశాలు న్నాయి. కాబట్టి స్టే పిటిషన్‌ను రద్దు చేయాల్సిందిగా కోరుతున్నానంటూ కూర్చున్నాడు. అబ్జెక్షన్ యువరానర్.. అంటూ అప్పుడే ఒక లాయర్ లేచాడు. అతనిని చూసిన జగన్ బృందం నిర్ఘాంత పోయింది. ఆ లాయర్ కూడా చంద్రబాబు లానే వున్నాడు. అతని పేరు లాయర్ ఇంద్రబాబు. అతను తన వాదన కొనసా గించాడు. యువరానర్ నా క్లయింట్ నిరపరాధి... ఒట్టి అమాయకుడు... అత నికి ఏ పాపం తెలియదు... కావాలంటే ఇప్పుడే నిరూపిస్తాను అని కోరాడు. అప్పుడు ప్రతి న్యాయవాది... నో యువ రానర్... అతను అమాయకుడు కాదు. 5 కోట్ల మంది ప్రజలను మాయ చేసి అమాయకులను చేసిన మహామాయ గాడు... అని చెబుతుండగా జస్టిస్‌చౌదరి కలుగజేసుకుని... అబ్జక్షన్ ఓవర్‌రూల్... మీరు ప్రొసీడ్ కండి... ఆయనను అమా యకుడని నిరూపించండి అని ఆర్డర్ ఇచ్చాడు. వెంటనే లాయర్ ఇంద్రబాబు తన క్లయింట్ చంద్రబాబుకు ఒక అరటి పండు ఇచ్చి దీనిని తినండి అని చెప్పాడు. వెంటనే చంద్రబాబు దానిని అలాగే కొరుక్కుని తినసాగాడు. అది చూపిస్తూ... చూసారా, యువరానర్, మనం అరటి పండును తొక్కతీసి తింటాం, కాని నా క్లయింట్‌కు తొక్క తీసుకుని అరటిపండు తినాలన్న సంగతి తెలియదు. ఇతని అమాయకత్వానికి ఇది మొదటి ఉదా హరణ... ఇంకో టెస్ట్ పెడతాను అంటూ వెయ్యి రూపాయల నోటు తీసి చంద్ర బాబుకు చూపిస్తూ ఇదేమిటని ఇంద్ర బాబు ప్రశ్నించాడు. చంద్రబాబు ఆ నోటును చూస్తూ ఇది తిరునాళ్లలో తోర ణాలుగా కట్టే రంగుల కాగితమన్నాడు. అప్పుడు ఇంద్రబాబు... నా క్లయింట్ అమాయకత్వానికి ఇది రెండో ఉదా హరణ అని చెప్పి ఇంకో టెస్ట్ అంటూ... ఓ కంప్యూటర్‌ను తెప్పించి ఇదేంటని అడిగాడు. అది చూసి చంద్రబాబు... అయ్... భలే భలే అని చప్పట్లు కొడుతూ... ఇది టీవీ సెట్టు... శుక్రవారం సంగీతలహరి, ఆదివారం చిత్రలహరి చూడొచ్చు అని చెప్పాడు. అప్పుడు లాయర్ ఇంద్రబాబు... చూసారా యువ రానర్, ఈ లోకం ఎఫ్‌టీవీల వైపు వేగంగా దూసుకుపోతున్నా, నా క్లయింట్ ఇంకా దూరదర్శన్ చిత్రలహరి కాలంలోనే ఉన్నాడు. ఇలాంటి అమాయకుడు, వెయ్యి రూపాయల నోటునే పసిగట్టలేని ఈ నిరపరాధిని 'ఓటు-నోటు' కేసులో ఇరి కించాలని చూస్తారా, ఇదే నా న్యాయం, ఇదేనా ధర్మం... చెప్పండి యువరానర్, చెప్పండి అంటూ గట్టిగా నిలదీశాడు. అప్పుడు జడ్జి తలపైకెత్తాడు. ఆయన కళ్లలో నీళ్లు కారుతున్నాయి. ఆయనను అప్పుడే జగన్ బ్యాచ్ క్లియర్‌గా చూసింది... అంతే వాళ్లు గుడ్లు తేలేసారు. కారణం.. జడ్జి కూడా మూడో చంద్ర బాబు లాగా వున్నాడు. ఆయన బాధాతప్త హృదయంతో... ఇలాంటి అమాయకుడిని విచారిస్తే అది న్యాయవ్యవస్థకే కళంకం... ఇలాంటి అన్యాయాలను ఈ జస్టిస్ చౌదరి సహించడు... కాబట్టి ఈ అమాయకుడిపై విచారణను నిలిపేయాల్సిందిగా ఆదేశి స్తున్నాను అంటూ లేచాడు. అప్పటికే జగన్ బృందానికి తలకాయలు పని చేయడం ఆగిపోయి కోర్టు బయటకు వచ్చారు. అక్కడ చంద్రబాబు, లాయర్ ఇంద్ర బాబుల ముందు అల్లాటప్పా ఛానెల్ విలేకరి మైకు పెట్టి... రాజకీయాల్లో నిష్కళంకిత చంద్రబాబు... ఈ నిష్పకు ఎలాంటి తుప్పుపట్టదని నిరూపణ అయింది... ఈరోజు కడిగిన ముత్యంలా ఆయన ముందుకు వచ్చారు అంటూ 'అల్లాటప్పా' ఛానెల్ ప్రతినిధి లైవ్‌లో చెబుతున్నాడు. జగన్ బృందం ఆ టీవీ ప్రతినిధి వైపు చూసింది.. ఆశ్చర్యం... అతను కూడా చంద్రబాబు లాగానే వున్నాడు. అతను లైవ్ ముగిస్తూ... నిజా యితీకి నిలువుటద్దం మన చంద్రబాబు... కోర్టు కూడా ఈ విషయాన్ని స్టాంప్ వేసి చెప్పింది... ఇట్లు కెమెరామెన్ పుల్లా రావుతో ఎయిర్‌న్యూస్ కృష్ణబాబు... అని ముగించాడు. జగన్ బృందం అక్కడ జరిగిందంతా కలగా చూడడం తప్ప ఇంకేమీ చేయలేకపోయింది.

# కన్నుల పండువగా వినాయకచవితి







నెల్లూరు నగరంలో ఎక్కడ చూసినా గణనాథుని సుందర విగ్రహాలు... ఒకదాన్ని మించి మరొకటి కనువిందు చేసాయి. యువకులు భక్తిని చాటుకుంటూ గణేష్ విగ్రహాలను చక్కగా కొలువుదీర్చారు. నెల్లూరుజిల్లాలో ప్రతి గ్రామంలో వినాయక చవితి వేడుకలను ప్రజలు ఆనందోత్సాల హాలతో సోమవారం జరుపుకున్నారు. వాడవాడలా వినాయక విగ్రహాలను ఏర్పాటుచేసి విశేషపూజలు నిర్వహించారు. నెల్లూరు నగరంలోని ప్రధాన సెంటర్లలో భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి విశేషపూజలు, అన్నదానం, ఉట్టి మహోత్స వాలను నిర్వహించారు. కాపువీధిలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మాట్లాడుతూ తమ కుటుంబసభ్యులతో ప్రతి ఏడాది ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి పూజలు నిర్వ హించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ వినాయకచవితి శుభాకాంక్షలు తెలియ జేశారు. ట్రంకురోడ్డులో ఏర్పాటు చేసిన తాత్కాలిక వరసిద్ధి ప్రసన్న వినాయకుని విగ్రహానికి ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. సంతపేట ములుమూడి బస్టాండ్ సెంటర్‌లోని రాణా ప్రతాప్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా వాసు ప్రత్యేకపూజలు నిర్వహించారు. మంగళవారం ఇక్కడ భక్తి శ్రద్ధలతో యాగం నిర్వహించి అన్నదానం చేశారు. స్వామీదాస్ స్కూల్ సెంటర్, పెద్ద పోస్టాఫీసు సెంటర్, కుక్కలగుంట, రాజేంద్రనగర్, బంగ్లాతోట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేకపూజలు చేశారు. వాడవాడలా ఏర్పాటు చేసిన భారీ గణేష్ విగ్రహాల వద్ద నిర్వాహకులు, మిత్రమండలి సభ్యులు అన్నదాన కార్యక్రమాలు, సంగీత విభావరి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కొందరు మంగళవారం విగ్రహాలను నిమ జ్జనం చేయగా మరికొందరు 9, 11రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసు కున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా వినాయక నవరాత్రి ఉత్సవాలను ఆనందంగా జరుపుకోవాలని పోలీసు వర్గాలు సూచిస్తున్నాయి.

# నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత విద్యా కోర్సులు



పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆంధ్రప్రదేశ్ వారి సౌజన్యంతో వసంత లక్ష్మి ఛారిట బుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న సదాశయంతో వివిధ కోర్సులను ఉచితంగా అందిస్తు న్నట్లు వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ డా॥ టి.వసంతలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ 18 నుండి 35 సంవత్సరాలలోపు పదవ తరగతి పాసు లేక ఫెయిల్ అయిన వారికి బెడ్‌సైడ్ నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్, రేడియోలజీ అసిస్టెంట్ కోర్సులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ కోర్సులే కాకుండా బ్యూటిషియన్ కోర్సు, బేసిక్ టైలరింగ్‌లో కూడా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 3నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చి పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి నూరుశాతం ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉత్తీర్ణులైనవారికి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సర్టిఫికేట్‌ను అందజేయబడుతుందని, ఈ సర్టిఫికేట్ మన దేశంలోనే కాకుండా గల్ఫ్ తదితర దేశాలలో కూడా ఉద్యోగం సంపాదించుకునేందుకు ఉపయోగపడుతుం దన్నారు. ఈ సువర్ణావకాశాన్ని నెల్లూరు యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కాలధర్మం

# గునుపాటి ఆదిశేషారెడ్డి



సీనియర్ న్యాయవాది, పాతతరం న్యాయవాదులలో ప్రముఖుడు, తన శిష్యరికంలో ఎంతోమంది న్యాయవాదులను నెల్లూరుకు అందించిన మేధావి గునుపాటి ఆదిశేషారెడ్డి తన 86వ యేట సెప్టెంబర్ 3వ తేదీ శనివారం రాత్రి హైదరా బాదులో కన్నుమూశారు. ఆయన గత కొన్ని సంవత్సరాలుగా హైదరాబాదులో తన చిన్నకుమారుడు మురళీకృష్ణారెడ్డి దగ్గరే వుంటూ ఇటీవలకాలంలో తీవ్ర అస్వస్థతకు గురై తుదిశ్వాస విడిచాడు.

జిల్లా న్యాయవాద రంగంలో గునుపాటి ఆదిశేషారెడ్డి అంటే ఓ సంచలనం. ముఖ్యంగా ఆర్బిట్రేషన్, ల్యాండ్ సీలింగ్ కేసులలో ఆదిశేషారెడ్డి వాదిస్తే గెలుపు ఖాయం అన్న నమ్మకం జిల్లా ప్రజల్లో వుంది. ఒక్క నెల్లూరులోనే కాకుండా ఇలాంటి కేసుల్లో రాష్ట్ర నలుమూలల నుండి ఆదిశేషారెడ్డి సలహాల కోసం న్యాయవాదులు సంప్రదించే వారంటే ఆయన మేధస్సు, కేసును వాదించడంలో ఆయన ప్రతిభ ఏపాటిదో మనం వూహించు కోవచ్చు. కేసులు వాదించాలన్నా, ప్రతివాదిని వాయించాలన్నా ఆయనకాయనే సాటి అనిపించుకున్న ఘనాపాటి గునుపాటి.

జక్కా, ఆదాల సోదరులకు ఆయన మేనమామ అవుతాడు. ప్రముఖ కాంట్రాక్టర్‌గా పారిశ్రామికవేత్తగా గ్రీన్‌పార్క్ హోటల్స్ నిర్మాణ సారథిగా ప్రసిద్ధిగాంచిన గునుపాటి హరిశ్చంద్రారెడ్డికి స్వయానా అన్న ఆదిశేషారెడ్డి.

తన చిన్ననాటి నుండే విద్యాభ్యాసమంతా నెల్లూరుజిల్లాలోనే పూర్తి చేసిన ఆయన మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీ నుండి న్యాయశాస్త్ర పట్టా పుచ్చుకున్నాడు.

న్యాయవాదిగా, గవర్నమెంట్ ప్లీడర్‌గా కొన్ని వేల కేసులను సునాయాసంగా వాదించి గెలిచిన చరిత్ర ఆదిశేషారెడ్డిది. అప్పట్లో జిల్లా న్యాయవ్యవస్థలో నక్షత్రంలా మెరుస్తుండిన మేనకూరు ఆదిశేషారెడ్డి దగ్గర గునుపాటి ఆదిశేషారెడ్డి శిష్యరికం చేశాడు. గురువును మించిన శిష్యుడిగా ఆదిశేషారెడ్డికి పేరుంది.

కేవలం కోర్టులో కేసులు వాదించడమే కాకుండా, అనేక పెద్ద కుటుంబాలకు చెందిన కుటుంబ కలహాలను సైతం సమర్ధవంతంగా పరిష్కరించి నిష్పక్షపాత వ్యక్తిగా పెద్దరికాన్ని పాటించాడన్న మంచిపేరును కూడా స్వంతం చేసుకున్న వ్యక్తి ఆదిశేషారెడ్డి.

ఆయనకు ఇద్దరు కుమారులు ముగ్గురు కుమార్తెలు కాగా ఒక కుమార్తె చిన్న వయస్సులోనే కన్నుమూసింది. భార్య రమాకాంతమ్మ కూడా కొద్ది సంవత్సరాల క్రితమే కాలంచేశారు. ఆదిశేషారెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.



## కావలి కబుర్లు

# కానరాని అభివృద్ధి

- రూ2లకు 20లీటర్ల మంచినీటి పథకం హుళక్కే
- కొత్తగాచేరిన గ్రామాలను పట్టించుకోని వైనం



మున్సిపల్ పాలకవర్గం ఏర్పడి 2సంవత్సరాలు పూర్తవుతున్నా కావలిలో చెప్పుకోనంత అభివృద్ధి జరుగలేదని విమర్శలు వెలువడుతున్నాయి. అలేఖ్య వైసీపీపార్టీనుంచి గెలిచి మున్సిపల్ ఛైర్మన్ పదవి రాలేదని టీడీపీలో చేరి మున్సిపల్ ఛైర్మన్ అయినప్పటినుండీ నేటివరకు అభివృద్ధికి అన్ని ఆటంకాలే. అఖ్య కొన్నాళ్లు పరిపాలన చేసినప్పటికీ చెప్పుకోదగ్గపనులు చేయలేకపోయారు. ఆమెపై వైసీపీ హైకోర్టు, సుప్రీంకోర్టులో కేసులు వేయగా ఇప్పటికీ అవి పెండింగ్‌లో ఉండటం గమనార్హం. అలేఖ్యను పక్కనపెట్టి మున్సిపల్ వైస్‌ఛైర్మన్ భరత్‌కు ఇన్‌చార్జి ఛైర్మన్‌గా పదవి ఇచ్చినప్పటికీ భరత్‌కూడా అటు టీడీపీతోనూ.. ఇటు వైసీపీతోనూ.. దోస్తీ చేస్తూ దోబూచులాడి కావలిని అభివృద్ధి దిశగా పయనింపచేయలేకపోయారు. పదవీ వ్యామోహంతప్ప అభివృద్ధిపై దృష్టి సారించలేకపోయారని విమర్శలు వెల్లువెత్తాయి. తిరిగి ఇటీవల కాలంలో అలేఖ్య తిరిగి పదవి చేపట్టినప్పటికీ అభివృద్ధిలో వెనకడుగుతప్ప ముందడుగు వేయలేకపోతున్నారు. ఇందుకు కారణం టీడీపీ కౌన్సిలర్లే ఆమెకు సహకరించలేదని విమర్శలు ఉన్నాయి.

అదేవిధంగా అలేఖ్య అందరితో కలిసిమెలిసి ఉండటంలేదని, కలుపుకొని పోవడంలేదని పలువురు కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీ నాయకుల దగ్గర వాపోయినట్లు సమాచారం. పట్టణంలో ఎప్పుడినుండో పెండింగ్‌లో ఉన్న సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయడం తప్ప ఈ పాలకవర్గంలో చెప్పుకోదగ్గ పనులు జరగలేదనేది వాస్తవం. పట్టణంలో దోమల బెడద అధికంగా ఉన్నప్పటికీ వాటినివారణ చర్యలు చేపట్టడంలేదు. అదేవిధంగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న ఇటీవల మున్సిపాలిటీలో చేరిన మద్దూరుపాడు, ముసునూరు, బుడమగుంట ప్రాంతాలలో త్రాగునీరుతోపాటు అనేక సమస్యలు ఉన్నా పాలకులు పట్టించుకోవడంలేదు. ముఖ్యంగా ఆ ప్రాంతంలో డ్రైనేజీ కాలువలు, రోడ్లులేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలైతే వర్షాలు వస్తే ఆ ప్రాంతాలన్నీ జలమయమై గత సంవత్సరం ప్రజలు నానా ఇబ్బందులు పడ్డా వాటిని అధిగమించే ప్రయత్నం ఇప్పటికీ చేయకపోవడం వల్ల ఆ ప్రాంత ప్రజలలో అసంతృప్తి ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. మున్సిపాలిటీ బడ్జెట్ రూ16కోట్లని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు అభివృద్ధి ఎక్కడ జరిగిందా అని ప్రశ్నిస్తే సమాధానం చెప్పేవారే లేరు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నిత్యం ఎక్కడ సమావేశాలు నిర్వహించినా కావలిని అభివృద్ధి చేయడంలో పాలకవర్గం విఫల మయిందని ప్రశ్నలు గుప్పిస్తున్నా తెలుగుదేశంపార్టీ నాయకులుగానీ అధికారులు గానీ సమాధానాలు చెప్పిన దాఖలాలు కన్పించడంలేదు.

అదేవిధంగా డంపింగ్ యార్డ్‌ను పట్టణంనుండి వేరే ప్రాంతానికి మార్చేందుకు కృషిచేస్తున్నామని చెప్పిన ఆ ప్రాంతంనుండి డంపింగ్‌యాడ్‌ను ఇప్పటికీ మార్చలేదు. ఆ ప్రాంతంలో 2014లో పార్కునిర్మాణం చేపడతామని అప్పటి ఎమ్మెల్యే బీదామస్తాన్ రావు శంకుస్థాపన చేసినప్పటికీ ఇప్పటికీ పనులు ప్రారంభించకపోవడం బాధాకరం. అదేవిధంగా మినీ స్టేడియం నిర్మిస్తామని నిధులు మంజూరు అయ్యాయని అప్పట్లో హడావిడి చేసినప్పటికీ తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి 2సంవత్సరాలు పూర్తయినా మినీ స్టేడియం పనులు ప్రారంభం కాకపోవడంతో క్రీడాకారులు, క్రీడాభిమానులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

40వార్డులలో రూ2లకే 20లీటర్ల మినరల్‌వాటర్ ప్రజలకు అందించేందుకు ఎన్.టీ.ఆర్ సుజల పథకం కేవలం 39వ వార్డులో ప్రారంభించినప్పటికీ అదికూడా మూతపడ్డంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశంపార్టీ ఎన్నికలలో పలు హామీలు గుప్పించినప్పటికీ పట్టణంలో స్వంత ఇళ్లులేక అద్దెఇంట్లో ఉన్నవారికి మూడుసెంట్లు భూమి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేయక పోవడం అదేవిధంగా డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మిస్తామని కేంద్రప్రభుత్వం అమృతపథకంలో కావలిని చేర్చిందని చెప్పారు. అది కాగితాలకే పరిమితమైంది తప్ప ఇప్పటివరకు అది ఆచరణకు నోచుకోలేదు.

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, మున్సిపల్ పాలకవర్గం స్పందించి కావలి పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశంగా పరిపాలన సాగించాలని ప్రజలు కోరుతున్నారు. లేకుంటే గత ప్రభుత్వాలకు పట్టిన గతే ఈ ప్రభుత్వాలకీ పడుతుందని హెచ్చరిస్తున్నారు.

# మండిన తెలుగు గుండెలు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పి వెళ్లిపోయాడు. ప్రత్యేకహోదా ఇవ్వలేమని చెప్పడానికే ఆయన ప్రెస్‌మీట్ పెట్టినట్లుగా వుంది. ఈశాన్య రాష్ట్రాలకు, ఎక్కువ శాతం కొండలున్న ప్రాంతాలకే ప్రత్యేకహోదా వర్తిస్తుందని నీతి అయోగ్ చెప్పిందంట! మరి వీళ్లు చదువుకున్నోళ్లు కాదా? ఈ సంగతి రాష్ట్ర విభజన సమయంలో తెలియదా? ఆరోజు సభలో ఏపికి ప్రత్యేకహోదా కల్పిస్తామని చెప్పిన నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ నిరక్షరాస్యుడా? ప్రత్యేకహోదా ఐదేళ్లు కాదు, పదేళ్లు కావాలంటూ పట్టుబట్టిన అరుణ్‌జైట్లీ, వెంకయ్యనాయుడులు తెలివిలేని వాళ్ళా? 2014 ఎన్నికల సభల్లో ఏపిని ప్రత్యేకహోదాతో ఆదుకుంటామని చెప్పిన నరేంద్రమోడీ అమాయకుడా? ప్రత్యేకహోదా నిబంధనలు ఆరోజు మాకు తెలియవని వీరెవరన్నా అంటే... వాళ్ళు ఒక్క నిముషం కూడా తమ పదవుల్లో ఉండడానికి అనర్హులు. ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వకపోవడానికి వారికి వేరే కారణాలున్నాయి. ఆ నెపాన్ని మాత్రం నీతి అయోగ్ మీద మోపుతున్నారు.

తలాతోక లేని ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించి అరుణ్‌జైట్లీ తెలుగువారి గుండెలను రగిలిస్తే, ఆ తర్వాత విజయవాడలో చంద్రబాబు ప్రెస్‌మీట్ పెట్టి ఈ ప్యాకేజీ పట్ల సంతృప్తి వ్యక్తం చేయడం ఆశ్చర్యం కలిగించింది. అరుణ్‌జైట్లీ ప్రకటన చూసాక... టీవీ9 లైవ్‌షోలో వున్న రవిప్రకాష్ కూడా... ఇంతటి పనికిమాలిన చెత్త ప్రెస్‌మీట్ తన జీవితంలో చూడలేదని చెప్పారు. ఒక మీడియా ప్రతినిధిగా అతనికే జైట్లీ ప్రకటన పట్ల అసహ్యం కలిగింది. కాని చంద్రబాబుకు మాత్రం చీమ కుట్టినట్లు కూడా అనిపించలేదు. ఆయన భయమేంటోగాని ప్రత్యేకహోదాను పక్కన పెట్టేసి వాళ్ళు అడుక్కుతినడానికి మంచి వెండిగిన్నె ఇస్తామన్నారు, ఇంత కంటే మన బ్రతుకులకు ఇంకేం కావాలన్నట్లు మాట్లాడారు. 2009లో వై.యస్. చనిపోయింది మొదలు ఏపికి దరిద్రం మొదలైంది. విభజనతో నాటి యూపిఏ రాష్ట్రాన్ని వంచిస్తే, నేడు ప్రత్యేకహోదా ఇవ్వకుండా ప్యాకేజీల పేరుతో బీజేపీ దారుణంగా మోసం చేసింది.

## ఇది 'దేశం'కు మాత్రమే పనికొచ్చే ప్యాకేజీ!

బ్రతుకుదెరువు కోసం ఓ కంపెనీ యజమాని దగ్గరకు ఓ నిరుద్యోగి వచ్చాడు. ఉద్యోగమిస్తే పనిచేస్తానన్నాడు. ఆ యజమాని నా వద్ద పనులేమీ లేవు... నీ మీద జాలిపడి లక్ష రూపాయలిస్తాను, ఏమన్నా చిన్న వ్యాపారం చేసుకుని బ్రతుకుపో అన్నాడు. ఇక్కడ లక్ష రూపాయలు ఇవ్వడం కంటే ఆ నిరుద్యోగికి ఉద్యోగం ఇచ్చి ఉంటే భవిష్యత్‌కు భరోసా ఉండేది. కాని అలా జరగలేదు. పోనీ ఆ నిరుద్యోగి కంపెనీ యజమాని ఇచ్చిన లక్షతో సోడాబండో, టిఫిన్ సెంటరో, టీకొట్టో పెట్టుకుంటే తన ఉపాధిని తానే సృష్టించుకున్నట్లవుతుంది. అలా కాకుండా చేతిలోకి ఒకటేసారి లక్ష వచ్చాయి కదా అని పబ్‌లకు, బార్‌లకు తిరిగి జల్సాలు చేస్తే వారంకల్లా మళ్లీ అతని బ్రతుకు రోడ్డున పడుతుంది. చేతుల్లో అడుక్కోవడానికి సత్తుగిన్నె మిగులుతుంది.

ఇప్పుడు ఇలాంటి అభద్రతా భావమే ఆంధ్రప్రదేశ్‌ను వెంటాడుతోంది. విభజన మూలంగా గాయపడ్డ ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకహోదాతో ఆదుకోవాలని రెండున్నరేళ్లుగా రాష్ట్ర ప్రజానీకం యావత్తు చేస్తున్న వేదన అరణ్యరోదనగానే మిగిలిపోనుంది. ప్రత్యేకహోదా డిమాండ్ చెవిటివాని ముందు దేవిశ్రీప్రసాద్ సంగీత కచేరిలానే వుంది. ఏపికి ప్రత్యేకహోదా ఇచ్చేందుకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నో కుంటిసాకులు చెబుతోంది. ఏపికి ప్రత్యేకహోదా ఇస్తే ఇంకా పలు రాష్ట్రాల నుండి ఆ డిమాండ్లు వస్తాయని కారణాలు చెబుతూ మన రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీతోనే సరిపెట్టడానికి సిద్ధపడింది.

జగన్ గర్జించినా, పవన్ ఘోషించినా కేంద్రం ఏపికి ప్రత్యేకహోదా ఇచ్చే వాతావరణం కనిపించడం లేదు. అదీగాక మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా మొదట్నుండి ప్రత్యేకహోదాపై కంటే కూడా ప్రత్యేకప్యాకేజీ పైనే అమితాసక్తి చూపుతున్నాడు. ఈ ప్రత్యేక ప్యాకేజీ వల్ల తెలుగుదేశంపార్టీ వారికి లాభముంటుందేమోగాని, రాష్ట్ర ప్రజలకు ఒరిగేదేమీ లేదు. ప్రత్యేకహోదా ఇస్తేనే రాష్ట్ర ప్రజలకు కొంతన్నా న్యాయం జరుగుతుంది. ప్రత్యేకహోదా క్రింద రావాల్సిన అన్ని బెనిఫిట్స్‌ను అమలు చేస్తే రాష్ట్రంలో స్థబ్దుగా వున్న పారిశ్రామిక, రియల్ ఎస్టేట్ రంగాల అభివృద్ధి కొంత ముందుకు కదలొచ్చు. కొత్తగా ఉపాధి అవకాశాలు కలగొచ్చు.

కాని ప్రత్యేక ప్యాకేజీ ఇస్తే దాని ఉపయోగం కొందరికే పరిమితమవుతుంది. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అభివృద్ధి పనులకు వాడాల్సిన నిధులను ఏ స్థాయిలో దుబారా చేస్తోందో కేంద్రానికి తెలియకుండా పోలేదు. పుష్కరాలు, పట్టిసీమ, రాజధాని భూములు...సెజ్‌ల పేరుతో జరుగుతున్న అవినీతి... ఇదంతా కేంద్రానికి తెలియదా? అంతెందుకు ఇంతవరకు కేంద్రం ఇచ్చిన నిధులకే రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు చెప్పడం లేదు. కేంద్రం ఒక ఉద్దేశ్యంతో ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇంకో విధంగా దారి మళ్లిస్తోంది.

రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులున్న నేపథ్యంలో కేంద్రం ప్రత్యేకప్యాకేజీ క్రింద ఎన్ని వేలకోట్లు నిధులిచ్చినా దుబారా కావడం, అవినీతి రూపంలో దారి మళ్లడమేగాని ప్రజలకు ప్రయోజనముండదు. కేంద్రం ప్రత్యేకప్యాకేజీ ఇస్తే అది కేవలం తెలుగుదేశం వారి కోసం ఇచ్చినట్లే! ప్రత్యేకహోదా ఇస్తేనే రాష్ట్ర ప్రజలకు ప్రయోజనం చేకూర్చినట్లు! నిద్రలేస్తే నీతి, నిజాయితీలకు మేం ప్రతిరూపం అని చెప్పుకునే బీజేపీ పాలకులు ప్రత్యేకప్యాకేజీతో అవినీతిని ప్రోత్సహిస్తారో, ఆలస్యంగానైనా ప్రత్యేకహోదా ఇచ్చి ఈ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను పరిరక్షిస్తారో చూడాలి.

# గ్రూపులుగా కాపులు

(మొదటి పేజీ తరువాయి)

అధినేత చంద్రబాబు నానా తంటాలు పడుతున్నాడు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు కాపులకు రిజర్వేషన్లు అమలు చేయలేనప్పటికి, కాపు కార్పొరేషన్ అంటూ ఒకటి పెట్టి దానికి రామానుజయ అనే కాపును ఛైర్మన్‌ను చేసాడు. తెలుగుదేశంలో ప్రధాన కాపునాయకులైన డిప్యూటి సిఎం నిమ్మకాయల చినరాజప్ప, మంత్రి పి.నారాయణ, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ చలమలశెట్టి రామానుజయులు కాపుల ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. అయితే వీళ్లెవరికీ కాపులను పార్టీలో నిలబెట్టే శక్తి సామర్థ్యాలు లేవు. ఇక రెండో కేంద్రం పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్. 2014 ఎన్నికల్లో ఈయనను చూసే కాపులు తెలుగుదేశంకు ఓట్లేశారు. ఈసారి పవన్ చెప్పినా కాపులు తెలుగుదేశం వైపు నిలబడే పరిస్థితులు లేవు. కాబట్టి పవన్‌కళ్యాణ్‌నే నేరుగా బరిలోకి దించి కాపుల ఓట్లు వైకాపాకు పోకుండా చీల్చాలనే ప్లాన్ కూడా జరుగుతోంది. ఇందుకు పవన్ కళ్యాణ్‌ను పావుగా వాడుకునే అవకాశం కూడా వుంది.

ఈ పరిణామాలను ఊహించిన కాపు పెద్దలు అలర్టయ్యారు. కాపులు ప్రత్యేక రాజకీయ వేదికను ఏర్పాటు చేయడమంటే అది మళ్లీ చంద్రబాబుకు ఆక్సిజన్‌ను అందించడమే! పవన్ కళ్యాణ్ వల్ల గత ఎన్నికల్లో జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇకముందు అలాంటివి జరగకూడదు. ముందు కాపులంతా ఏకతాటిపైకి తీసుకురావాలి. వచ్చే ఎన్నికలనాటికి బలమైన రాజకీయ నిర్ణయం తీసుకోవాలి. కాపుల ప్రయోజనాలను పరిరక్షించే రాజకీయ శక్తులతో కలిసి ముందుకు నడవాలి అనే లక్ష్యంతో కాపు నాయకులు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే ముద్రగడ పద్మనాభం నాయకత్వంలో దాసరి నారాయణరావు, బొత్స సత్యనారాయణ, పళ్లంరాజు, అంబటి రాంబాబు, చిరంజీవి వంటి వారంతా నడుస్తున్నారు. కాపుల పరంగా భవిష్యత్‌లో ముద్రగడ నిర్ణయమే కీలకం కాబోతోంది. ఇప్పటికే తెలుగుదేశం ప్రభుత్వంపై ఆగ్రహంతో రగిలిపోతున్న ముద్రగడ... ప్రత్యామ్నాయ శక్తులతో కలిసి నడుస్తాడనడంలో సందేహం లేదు.

## చలంచర్లకు.. ప్రజావాకర్స్ సంఘం సత్కారం



తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షులు, నెల్లూరుజిల్లా ప్రజా వాకర్స్ సంఘం అధ్యక్షులు చలంచర్ల భాస్కరరెడ్డి ప్రభుత్వ పురస్కారాన్ని అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని నెల్లూరు పొదలకూరురోడ్డులోని జడ్పీ బాలికల స్కూలు ఆవరణలో సంఘం కార్యవర్గసభ్యులు ఇటీవల ఘనంగా సత్కరించారు. సంఘ ఉపాధ్యక్షులు టివి రమణయ్య అధ్యక్షత వహించగా, వాకర్స్ ఇంటర్నేషనల్ తరపున యం.వి.సుబ్బారెడ్డి, మైథిలి మనోహర్ రెడ్డి, నెల్లూరు హాస్పిటల్ డా॥ జయకుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అనంతరం మధురకవి బిరుదవోలు రామిరెడ్డి పద్యకవితతో చలంచర్ల కీర్తిని శ్లాఘించారు. మండవ శ్రీనివాసరావు, జెయస్‌ఆర్ ఆంజనేయులు, యం.వి. కృష్ణయ్య, వి.యస్.ప్రసాద్, బి.రాజగోపాల్, వై.శంకరయ్య, యం.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మన స్వాతంత్ర్యవీరులు

(2వ పేజీ తరువాయి)

| క్ర.సం | పేరు | ఊరు |
|---|---|---|
| 270 | శేషగిరిరావు జెవి | నెల్లూరు |
| 271 | శేషారెడ్డి బండి | గంగపట్నం నెల్లూరు తాలూకా |
| 272 | శేషారెడ్డి దేశిరెడ్డి | గూడూరు |
| 273 | శేషారెడ్డి కనుమూరు | పోట్లపూడి నెల్లూరు తాలూకా |
| 274 | శేషారెడ్డి ముక్రంరెడ్డి | పోట్లపూడి నెల్లూరు తాలూకా |
| 275 | శేషారెడ్డి పెళ్ళకూరు | మక్తాపురం కోవూరు తాలూకా |
| 276 | శేషారెడ్డి వేమిరెడ్డి | మైపాడు నెల్లూరు తాలూకా |
| 277 | శేషయ్య చిట్టం | చెన్నూరు గూడూరు తాలూకా |
| 278 | శేషయ్య పొట్టిపాపగారి | వెంకటగిరి |
| 279 | శేషయ్యనాయుడు భీమవరపు | అల్లూరు కోవూరు తాలూకా |
| 280 | శేషరెడ్డి బొమ్మా | గండవరం కోవూరు తాలూకా |
| 281 | శేషరెడ్డి దేవరపల్లి | ఊటుకూరు కోవూరు తాలూకా |
| 282 | శేషరెడ్డి కొంట్లా | గోగులపల్లి కోవూరు తాలూకా |
| 283 | షేక్ చాబీ సాహెబ్ | వెంకటగిరి |
| 284 | షేక్ మహబూబ్‌హుస్సేన్ | గూడూరు |
| 285 | షేక్ మొహిద్దీన్‌సాహెబ్ | కావలి తాలూకా |
| 286 | షేక్ మురంసాహెబ్ | నావూరు ఆత్మకూరు తాలూకా |
| 287 | షణ్ముగం కమతం | వెంకటగిరి తాలూకా |
| 288 | సిద్దులు పొట్టిముత్యాలు | వెంకటగిరి |
| 289 | సీతారామాంజనేయులు పత్రి | నెల్లూరు |
| 290 | సీతారాంరెడ్డి సూరం అలియాస్ నెల్లూరు సీతారెడ్డి | నెల్లూరు |
| 291 | సీతారామిరెడ్డి మేనకూరు | బుచ్చిరెడ్డిపాళెం కోవూరు తాలూకా |
| 292 | శివకామయ్య యనమంద్ర | అల్లూరు కోవూరు తాలూకా |
| 293 | శివకోటారెడ్డి బెజవాడ | బుచ్చిరెడ్డిపాళెం |
| 294 | శివయ్య ఆమరలక్ష్మి | గూడూరు |
| 295 | సోమయ్య ఇమ్ముడిశెట్టి | యల్లాయపాళెం కోవూరు తాలూకా |
| 296 | శ్రీనివాసన్ కందాడై అలియాస్ దొరైస్వామి అయ్యంగార్ | నెల్లూరు |
| 297 | శ్రీనివాసులురెడ్డి వేమారెడ్డి | వరగలి గూడూరు తాలూకా |
| 298 | శ్రీరాములు గోపాలుని | కొమ్మలపూడి నెల్లూరు తాలూకా |
| 299 | శ్రీరాములు కమ్మళ్ళ | కావలి |
| 300 | శ్రీరాములు పొట్టి | జువ్వలదిన్నె కావలి తాలూకా |
| 301 | శ్రీరాములు తోకపూడి | వెంకటగిరి |
| 302 | సుబ్బమ్మ రామలింగం | గోగులపల్లి కోవూరు తాలూకా |
| 303 | సుబ్బరామనాయుడు నావా | పగడాలపల్లి |
| 304 | సుబ్బరామయ్య అద్దంకి | నార్త్ మోపూరు |
| 305 | సుబ్బరామయ్య అక్కరాజు | బిరుదవోలు రాపూరు తాలూకా |
| 306 | సుబ్బరామయ్య గిద్దలూరు | మడమనూరు నెల్లూరు తాలూకా |
| 307 | సుబ్బరామయ్య జనపాల | గూడూరు |
| 308 | సుబ్బరామయ్య కనుమళ్ళ | కావలి |
| 309 | సుబ్బరామయ్య పడాల | మడమనూరు నెల్లూరు తాలూకా |
| 310 | సుబ్బరామయ్య పాటూరు | నెల్లూరు |
| 311 | సుబ్బరామయ్య పొట్టిముత్యాలు | వెంకటగిరి |
| 312 | సుబ్బరామయ్య సూరం | సూళ్ళూరుపేట |
| 313 | సుబ్బరామయ్య తాళ్ళ | బుచ్చి, కోవూరు తాలూకా |
| 314 | సుబ్బరామిరెడ్డి అనపల్లి | గూడూరు |
| 315 | సుబ్బరామిరెడ్డి దేశిరెడ్డి | గూడూరు |
| 316 | సుబ్బరామిరెడ్డి దొడ్ల | అల్లూరు కోవూరు తాలూకా |
| 317 | సుబ్బరామిరెడ్డి గున్నంరెడ్డి | మడమనూరు నెల్లూరు తాలూకా |
| 318 | సుబ్బరామిరెడ్డి కాకు | పార్లపల్లి కోవూరు తాలూకా |
| 319 | సుబ్బరామిరెడ్డి కొప్పోలు | గండవరం కోవూరు తాలూకా |
| 320 | సుబ్బరామిరెడ్డి లేబూరు | బుచ్చిరెడ్డిపాళెం కోవూరు తాలూకా |
| 321 | సుబ్బరామిరెడ్డి మలుచూరు | పెద్దపుత్తేడు కోవూరు తాలూకా |
| 322 | సుబ్బరామిరెడ్డి పందిపాటి | యల్లాయపాళెం కోవూరు తాలూకా |
| 323 | సుబ్బరామిరెడ్డి పోలంరెడ్డి | లేబూరు నెల్లూరు తాలూకా |
| 324 | సుబ్బరామిరెడ్డి పోలంరెడ్డి | అల్లూరు కోవూరు తాలూకా |
| 325 | సుబ్బరామిరెడ్డి పూండ్ల | ముంగమూరు కావలి తాలూకా |
| 326 | సుబ్బారావు ఖాసా | నెల్లూరు జిల్లా |
| 327 | సుబ్బరాయుడు వేషాల | నెల్లూరు |
| 328 | సుబ్బారెడ్డి దంపూరు | అల్లూరు కోవూరు తాలూకా |
| 329 | సుబ్బారెడ్డి దొడ్ల | లేబూరు నెల్లూరు తాలూకా |
| 330 | సుబ్బారెడ్డి గుమ్మడి | గోగులపల్లి కోవూరు తాలూకా |
| 331 | సుబ్బారెడ్డి టంగుటూరు | బుచ్చిరెడ్డిపాళెం కోవూరు తాలూకా |
| 332 | సుబ్బయ్య సిహెచ్ | నెల్లూరు |
| 333 | సుబ్బయ్య జొన్నా | చెన్నూరు గూడూరు తాలూకా |
| 334 | సుబ్బయ్య మాదరపాక | సూళ్ళూరుపేట |

(మరిన్ని పేర్లు వచ్చే వారం)

# శ్రద్ధాంజలి



జననం
01.07.1930

మరణం
03.09.2016

ప్రముఖ న్యాయవాది, మా ఇంటి దైవం

## గునుపాటి ఆదిశేషారెడ్డి గారు

తే. 03.09.2016ది శనివారం పరమపదించినారు.
వారి పవిత్రాత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు
గునుపాటి శ్రీనివాసులురెడ్డి - సింధు
గునుపాటి మురళీకృష్ణారెడ్డి - ప్రతిమ

మనుమలు, మనుమరాళ్ళు
ముదిమనుమలు - ముదిమనుమరాళ్ళు

కుమార్తెలు - అల్లుళ్ళు
ఉప్పల విజయలక్ష్మి - సుదర్శన్‌రెడ్డి
లేట్ పెనుబోలు పద్మజ - చంద్రశేఖర్‌రెడ్డి
పోలకూరు మాధవి - పద్మాకర్‌రెడ్డి

మరియు
ఇతర కుటుంబసభ్యులు

**ఉత్తరక్రియలు :** వారి పెద్దకర్మ తే.15.09.2016ది గురువారం ఉ॥ 11.30గంటలకు హైదరాబాద్ కొండాపూర్ హైటెక్‌సిటీ సమీపంలోని సైబర్ సిటీ కన్వెన్షన్ సెంటర్ నందు జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com